
5850



# ఆంధ్రశిల్పి

## సచిత్ర మాసపత్రిక

సంపాదకులు

శ్రీ గణపతిశాస్త్రి : శ్రీ సాంబశివరావు

సర్వధారి : ఆశ్వయుజ కార్తీకములు

వెల : ౮ అణాలు

౧౦, నరసింగపురం వీథి,

మౌంట్ రోడ్, మదరాసు.

# వి ష య సూ చి క


| | | | పుట |
|---|---|---|---|
| ఆదిమజంతువు | ... ... | శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు | ౩ |
| కారుణ్యము | ... ... | శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు | ౫ |
| జాహ్నవ | ... ... | శ్రీ నాదెళ్ల జనార్దనరావుగారు | ౭ |
| కావ్యజగత్తు | ... ... | శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు | ౯ |
| శ్రీ జనార్దనరావు | ... ... | శ్రీరంగం శ్రీనివాసరావుగారు | ౧౩ |
| శుకజనక సంవాదము | ... ... | శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారు | ౨౧ |
| కళ-దానిజాతీయప్రాముఖ్యత... | ... | స్వర్గీయ శ్రీ మంగిపూడి పురుషోత్తమ శర్మగారు | ౨౪ |
| కృతజ్ఞత | ... ... | శ్రీ తూలికాభూషణగారు | ౩౧ |
| యాచకులు | ... ... | శ్రీ దిగుమర్తి రామారావుగారు | ౩౫ |
| శ్రీకృష్ణలాల్ భట్ | ... ... | శ్రీ జయంతి పరేఖ్‌గారు | ౪౦ |
| పాండురంగకృతి వ్యాఖ్యావిధానము | ... | శ్రీ బులుసు వెంకటరమణయ్యగారు | ౪౩ |
| సంపాదకసమీక్షలు | ... ... | సంపాదకులు | ౪౬ |
| గ్రంథవిమర్శనము | ... ... | | ౪౯ |


## శి ల్పా లు


నటరాజు ... ... ...

కృష్ణలాల్ భట్ చిత్రాలు ... ... ...

కృష్ణలాల్ భట్ చిత్రాలు ... ... ...


## గ మ ని క

వ్యాసాలు పంపేవారు విడివిడిగా ఒకేవైపు వ్రాసి పంపాలి. అవి తిరిగి కావలసినా, సమాధానాలు కావలసినా తపాలావ్యయం వ్యాసకర్తలే భరించాలి. వ్యాసకర్తల ఆశయాలకు సంపాదకులు బాధ్యులుకారు. విమర్శనార్థం పుస్తకాలు పంపేవారు రెండేసి కాపీలు పంపాలి.

సంపాదకులు.



పంపుటి ౩

# ఆంధ్రశిల్పి

సంచిక ౩, ౪

# ఆదిమజంతువు

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

చిమ్మ చీఁకటి కాంతి పూరమ్ము లేని
యొక వినూతనమౌ దిన ముప్పతిల్లె
ఱెప్పలను మూయు చందమ్ము విప్పు వడువు
కాన రాకున్న యొక కొత్త కన్ను విచ్చె.

జన్మ జన్మాంతరంబుల శతమునుండి
సంచితంబగు నంధ సంస్కార జలధి
నొక్క రత్నము చూడఁగాఁ జిక్కె నహహ
దానిఁ గ్రువ్వంగ దూరముదార మకట.

మానసమధ్యమందులను మాయను మాయముచేసి, నన్ను నా
లోనె వహించి దేనికిని లొంగ కిలా వల యాంత వేలయం
దేను వసించియున్న నెవరే వెనువెన్కను వచ్చి దూరదూ
రాననె పిల్చి నన్నలఁ గరం బొనరింతురు వేళ్లు ప్రీలఁగన్ ?

నా మనమందు నించుకయు నా యధికారము లేదు చంచలా
భూమిగ మాఱు నా మనముపొత్తున నీవు వసింపలేవు న
న్నీ మెయి నున్న పాళముగ నీఁగు మదే పదివేలు, నేను నీ
నామము చెప్పికొందు నదనంబుగ వేఁదురె యెత్తికుండినన్.

# ఆంధ్ర శిల్పి

నీదు మనోరథంబునకు నే నొనరింపని త్యాగ మేది? యు
త్యాదృతి నెన్ని దేహములు ప్రాణ సమేతముగా నొసంగ నో
యాదిమ జంతువా! యెఱుఁగవా యది? యిప్పటికొక్క కొత్తరూ
పూఁదితి గాక నే నెఱుఁగనో నిను మాయలమారి మానసీ!

నేను మహా వీరుండం
గానోసీ! నాదు మనము కాదిను మీ నా
ప్రాణ మమంద స్పంద వి
హీనంబుం గాదు తెలియుమీ నిక్కువమున్.

నీవే సరిగా నీవే
యీ వేషం బా కటాక్షమాత్రప యదియే
కావి యదే తావి యదే
యావి యదే యెల్ల నదియె యాదిమజంతూ!

పిట్ట పిడుగుగ వచ్చి యీ చిట్టచివర
నేలముంగిట నీలి మున్నీరి మ్రోల
అక్రమంబుగ నామనం బాక్రమించి
వింతగా నన్ను నెవ్వరే వెదకువారు!



# కారుణ్యము

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

పండువెన్నెలలోన పవళింప శశిరేఖ
శ్వేత వస్త్రము నెల్ల చీరగా ధరియించె;
కాలిగజ్జెల నిలువ మేలి ముత్తెము లెల్ల
సప్తస్వరమ్ములు పలుప నాందీరవము నందె.

చీర సింగారించి, చేమంతి పూదండ
కైవారముగ దాల్చి, కరములన్ జోడించె,
మేలి ముసుగులనిల్చు మేఘ మోంకారముల
ప్రణవ గీతముపాడె ప్రణయవల్లిక నాడు.

ఓంకారనాదమున నూగాడె తెరలుచును
దైవ ప్రభలమించె తరళ శంపాలతలు;
ఆమృదు పరిష్వంగ హాయి భావంబులో
సమృత ఖాండము చిందె ఆనందముల చిలుక.

అలలపై తే రాజిల్లె నలకలాభాలము
దివిలోక సౌందర్య మావరించగ దిశల—
సిందూర తిలకమ్ము చెమ్మగిలి చిమ్మగా
భ్రూమధ్యమును వలచె భోగలాలన కళలు.

మహిత భావముతోడ మాంగల్య రేఖలను
దశ దిశల గన్పరచు దారుణి సౌందర్య
భావనల నీక్షింప పరిణాహ రూపమున
ప్రీతితో గాంచితిని బింబవిస్మేరమును!

# ఆంధ్రశిల్పి

ఆమె నామాక్షరము లమృతస్రవంతిలో
లీనమై వెలుగుచును. రేగినవి హృదయమున!
కాని నా హృదయ ప్రాకారమునజ్యోతిగా,
చైతన్యముగ వెలయ చేరినా నసె నపుడు.

వనదుర్గవలె [illegible] వాత్సల్యములు కదల,
లలిత రీతిగ జనని లాలనమ్ములు తరల,
మాయయై, ఛాయయై, మాధుర్యమున వెలయ,
కాంచితి నుమా బాల కరుణా కటాక్షముల.

ఆ కనులలో గాఢముగ [illegible]గయున్న విభావ
విస్రబ్ధవీచికలు వెన్నెలల వరుసగా!
కాని మేఘోద్రిక్త కల్పావసానమ్ము
శాంఠదను కప్పగా సాహసించునె నేడు?



# జాషువ

**శ్రీ నాదెళ్ల జనార్దనరావు**

౧

బాలురకున్ ముదంబొదవఁ బాఠము చెప్పెడు పండితుండ! వి
ద్యాలలనాతనూజుఁడ! సుధామధురోక్తులు పల్కఁ, దెల్గు భా
షాలత పూవులందొడిగి, చక్కని తేఁటిపురుల్గులిర్వఁగాఁ,
జాలగ నూగితీవు సరసత్వఁపుటుయ్యెల నేటవాలుగా!

౨

భావవిపంచికా మధురభాషితమైన కలస్వనంబుతో
నీవొకయందరాని రమణీయ రసాలఁపుశాఖ, గాన వి
ద్యావిధి విందొనర్చు హృదయంగమ కోకిలగా స్ఫురించి, నే
త్రావులుజిమ్ము నీదు కవితామధురోక్తి ప్రతిధ్వనించెడున్!

౩

కమ్మని పల్కులంజిలుకు కావ్యపదధ్వనితో నొయారముల్
గ్రిమ్ముకొనం జరించెడు విలాసపుటెండలపంచ శోభలం
జిమ్ముచుఁబోవుకైత నెజనీటు తెలుంగుఁగ నేయపూర్వ పు
ణ్యమ్ములు పండెనో తెలుఁగునాటికి నిదగి కావ్య ఫక్కికన్!

౪

కిన్నరకామినీమృదులగీతుల నీకవితావిలాసఁపుం
గన్నియ పల్కుపల్కునను గమ్మనితావులు గ్రుమ్మరించి. పే
రెన్నిక గన్నపండితుల బృందము ముందర నాట్యమాడి, వా
కొన్నది కీరగాన మధుకూజనముల్, తలయూపు లందుచున్!

# ఆంధ్ర శిల్పి

౫

భూరిదురంత దుష్టమదపూర్ణులు రాజులు; వారిఁ గొల్వ స్వే
చ్ఛారతి చిత్తవృత్తుల కసాధ్యపరిస్థితి; కాని, మీ, రసా
ధారుణధారుణీ భృదభిధానతచేఁ గవిరాజులంచు, మ
చ్చారు పవిత్రకావ్యపథసంగతిఁ గొల్తు రసాభిషేకతన్.

౬

మిమ్ముం గాంచి, సుధాప్రవాహగతిగా మీవాక్కులందోఁగి, మో
దమ్ముం జెంది, మనోజ్ఞభావ వివశాత్మన్, రాగసుశ్రీలమే
యమ్మై్మ దవ్వుల వ్యాపృతించె; హ్రాదమధ్యమ్మౌని, నాకాశమ
ధ్యమ్మం దేని సుధాంశుమూర్తి కళ లాహ్లాదంబు సంధింపవే ?

౭

అలసత బంధనిమ్నుక్రియగా నెటులోయటులన్ శ్రమించుచేఁ
బలికెడు పద్యవైఖరి కవజ్ఞ ఘటింపరు మీరటంచు లోఁ
దెలియునటన్న నెల్లగు మతిభ్రమణంబు ? కళాచయమ్ము చే
జెలువగు వానికిచ్చెదరు జీర్ణకుచేలపు నూలుపోగులన్ !

౮

నీసాహిత్యమరీచిపిచికల వాణీగాన మాధుర్యముల్
వాసింగాంచె శ్రవస్సుఖమ్ములయి; కళాభాస్వద్విహారమ్ములం
దాసంజేసి చరించు మాదృశనవవ్యాసంగ కావ్యైరతుల్
సేసల్వోటి వచించుగావుత శుభాశీర్వాద వాక్యంబులన్ !

# కావ్యజగత్తు

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

[సాహితీసమితి.]

౧

౧. కావ్య ప్రయోజన వివేచనలో ఆలంకారికు లనేకులు నిమగ్నులై, చివరకు ఆనందోపదేశములను వేరువేరుగా గాని, సముదాయ రూపముగా గాని భరతుని మొదలు జగన్నాథుని వరకు తేల్చినారు. కాని హెగెల్ (Hegel) అనినట్లు ప్రయోజన (Purpose) శబ్దమును ఉపయోగ (use, utily) శబ్దముతో నభిన్నముగా స్వీకరింపరాదు. ఒక వస్తువునకు ఉపయోగ మున్నదనిన, ఆ వస్తు వన్య వస్తువునుగాని, స్థితినిగాని, క్రియనుగాని ఆశ్రయించుకొని తదర్థము ప్రవృత్తి నపేక్షించునని భావము. అనగా ఉపయోగ సహితమగు వస్తువు కేవలము సాపేక్షము, అన్యాశ్రితము, అసమగ్రము, పరతః ప్రమాణసిద్ధమునగు సాధనము. అనగా అన్యార్థోపజీవి.

౨. ఒక వస్తువునకు ప్రయోజన మున్నదనిన, ఈ ప్రయోజనము తద్వస్త్వధీనము మాత్రమే కాక, తదంతర్లీనముకూడా అగుచున్నది. అనగా తద్వస్త్వంతర్గతమగు శక్తి నిష్ఠమైనది ప్రయోజనము. ప్రయోజన సహితమగు వస్తువు అనన్యాశ్రితము, స్వతఃసిద్ధము, స్వతః ప్రామాణికము, నిరపేక్షము కూడా నగుచున్నది. కాగా నిది సాధనముగాక సాధ్యమే అని విస్మరించరాదు. ప్రయోజనము అన్యార్థోపజీవి.

౩. కావ్యమునకు ప్రయోజనమేమైన గలదా? లేక ఉపయోగమే కలదా? అను ప్రశ్న బయలుదేరుటకు గల కారణము తెలిసిన కాని కావ్యప్రయోజనము సువ్యక్తము కానేరదు. భౌతిక రసాయనాది శాస్త్రములు కొన్ని నియమముల ననుసరించి ప్రవర్తించుచు ఉపయోగ సహితములగు క్రియలలోను, విషయాన్వేషణలోను నిమగ్నమగుచున్నవి. అనగా ప్రవృత్తి పరమైనవి శాస్త్రములు. కాని లలిత కళలలో వినోదమున్నదని సామాన్య జనాభిప్రాయము. దైనందిన క్రియలలో అలసిపోయి విశ్రాంతిని తీసుకొనువేళ కావ్యము మన విక్షిప్త వృత్తులను విస్మరింపజేయుచున్నది. కులాసాగా ప్రొద్దుగడవుట కుపకరించు లలిత కళలను శాస్త్రనయము ననుసరించి పరిష్కరించుట అసమంజస మని జనాభిప్రాయము. ఈ అభిప్రాయమును నిర్మూలించు నిచ్ఛతో లలితకళ లనేక విధముల ఉపకరించునని, సాహితీవేత్త లుపన్యసింప సాగినారు. ఈ ఉపయోగములలో ముఖ్యమైనది ఉపదేష్టృత్వము. ఇంతమాత్రమున లలిత కళలకు శాస్త్రీయ ప్రపంచమున స్థానము కుదరదు. పైగా సత్యజగత్తుయొక్క ఆభాసయే కళావిశ్వమున కన్పించుటచే నొక విధమగు అతాత్త్వికమైన వంచన లలితకళల నావేశించుచున్నది. వంచన (Deception) ద్వారా సత్యమగు ఉపదేశముకూడా కలుగనేరదు.

౪. లలిత కళలలోని సౌందర్యము ఇంద్రియమును, మానసి కానుభూతిని, ప్రత్యక్షతను, భావనను

ఉద్దేశించినది. అంతేకాని బుద్ధి గ్రాహ్యత్వము లలిత కళలకులేదని సామాన్య జనుల ద్వితీయవాదము. కావ్య భావనలో నియమావళి నతిక్రమించి స్వైరవిహారము చేయుచు, విశ్రాంతి నందుచున్నాము. అనియతిమగు భావన విహరించు ప్రదేశమున, కాలమున, బుద్ధి ప్రవర్తింపదు. కావుననే శాస్త్రనయమున భావన (Imagination) పరిత్యక్తమగుచున్నది. భావనలో నియమరాహిత్యత, ఆకస్మికోద్రేకాదులు మాత్రమే కలవు. కాగా లలిత కళలకు శాస్త్రీయ విమర్శగాని, ప్రయోజనముగాని లేవని వీరి అభిప్రాయము.

౫. భౌతిక రసాయనాది శాస్త్రములు, వేదాంతము, లలిత కళలుకూడా తత్త్వాన్వేషణలో నిమగ్నమై తత్త్వావిష్కృతి చేయగలిగినపుడే తాత్త్వికములై స్వేచ్ఛానుస్యూతములై ఉండగలవు. ఉదాత్తములు, ఉత్తమములు, దివ్యములునగు భావములను, తత్త్వములను వివిధదేశములలో, విభిన్నకాలములలో లలిత కళలే నిధివలె కాపాడినవి. వారివారి మత విజ్ఞానముల నవగాహనము చేసికొనుటకు కూడ లలితకళలే ఉపయోగపడుచున్నవి. మత విజ్ఞానముల (Religion and Philosphy) తో బాటు లలిత కళలే (Fine Arts) తత్త్వావిష్కృతి మగ్నములై, సంస్కృతిని పెంపొందించి, ఆత్మవికాసహేతుకములైనవి. కావున లలితకళలకు శాస్త్రీయజగత్తున మత విజ్ఞానములతో సమానమగు స్థానము కలదు, కాని లలితకళలుమాత్రము అవిచ్ఛిన్న లోపమునందు, అలౌకిక తత్త్వమును లౌకికాకృతిలో ప్రదర్శించి, ఆత్మేంద్రియ సంయోగమును జూపుచున్నవి.

౬. ఇదేవిధముగా లలితకళలు వంచనాత్మకములను వాదముకూడా యుక్తిరహితమే, కళాప్రపంచమున వంచనలేదు. కాని కొంత అనిర్వచనీయత్వమున్నది. అనిర్వచనీయత్వమనగా సత్యాసత్యవిలక్షణమై సత్యస్ఫూర్తికి దోహదమగు భానము. ఏవంవిధమైన భానము (Appearance) సత్యమున విశిష్టాంశము. ఆత్మావలోకనమే ప్రయోజనముగా గాక, చైతన్యాభివ్యక్తికి ప్రతీయమానము కానిది సత్యము కానేరదు. కావుననే సత్యము ప్రాతిభాసికాది రూపములలో గోచరించుచున్నది. అతీంద్రియము, అపరిచ్ఛిన్నమగు తత్త్వము, పరిచ్ఛిన్నముగా- నామరూపములతో, సేంద్రియముగా కనబడుటయే లలితకళలలోనున్న వంచన. ఈ వంచన వ్యావహారిక జగత్తులో కూడా కలదు. దీనినే వేదాంతులు అధ్యాస అని, పరిచ్ఛిన్నత అని వచించినారు. కాగా అవిద్యాకృతమగు అధ్యాస అనబడు వంచన లలితకళలలో ప్రత్యేకముగా గోచరించునది మాత్రముగాదు. కాని లౌకిక జగత్తుకన్న విలక్షణముగా కళావిశ్వము ప్రతీయమానమగుటచే జనులు కావ్యప్రపంచమును కేవలము వంచనగాను, అసత్యముగాను పరిగణించుచున్నారు. అనగా సామాన్యజనుల అభిప్రాయము ననుసరించి కావ్యజగత్తు సత్యముకాదని, వ్యావహారిజగత్తు సత్యమని చెప్పవచ్చును. అనగా అంతరజగత్తగు కళాప్రపంచము అసత్యము. కాని వాస్తవముగా అంతరజగత్తు సత్యము, బాహ్యజగత్తులో నంతర్లీనమునని ముందుముందు తేలగలదు. తాత్త్వికము, లౌకికవిలక్షణమునగు సత్యజగత్తు నావిష్కరించుటలో లలితకళలు వ్యాపృతము లగుచున్నవి. అధ్యస్తజగద్వివేచనలతో కాలము గడుపక, తద్వివర్తోపాదానమగు సత్యము నవగాహనముచేసికొనజాలు దర్శనను లలితకళ లనుభవించును.

౭. చరిత్రాత్మక విజ్ఞానమునకు అద్యతన సత్యత్త్వము లేదు, బుద్ధిరూపమున భూతకాలము పరోక్షమున

సాక్షాత్తుగా ప్రతీయమానమగుచున్నది. ఏతద్విషయ సమూహమున క్షణికత్వాద్యవచ్ఛిన్న భౌతికసామగ్రియే ప్రాచుర్యముగా కనబడుచున్నది. ఇదేవిధముగా భౌతిక రసాయనాది శాస్త్రములలో బాహ్య జగత్తు మాత్రమే వివేచింపబడుచున్నదిగాని, తదాధార హేతువగు సత్యముకాదు, కాని లలితకళలలో దీనిని హేతుభూతము, జ్ఞాపకమునగు శాశ్వత తత్త్వమే విషయము.

౮ లలితకళలు, మతము, విజ్ఞానము అనునవి ఉత్తరోత్తర బలీయములు, లలితకళలలో కలుగు సద్యఃపరనిర్వృతి జ్ఞానాకారమగు చిత్తవృత్తి (Act of Judgement) మాత్రమేనని ఒప్పుకొనక తప్పదు. కావ్య సౌందర్యము, తత్త్వ (Thought) భిన్నమగు రూపమున ఆవిష్కృతమగుచున్నది. ఈ రూప నిర్మూలనము తత్త్వమునకు గల ప్రవృత్తి. కాని సౌందర్యమే ఈ తత్త్వము. అనగా తత్త్వమొక రూపమున పరిచ్ఛిన్నమై, తద్రూపనిర్మూలనలో వ్యాపృత మగుచున్నది. కాగా కావ్యజగత్తున విచ్ఛేదాత్మకమగు సంఘటన (Conflict) సర్వదా కలదు.

౯ ఆత్మావలోకనము చేయగలిగి, సంవిత్సంవేదన గలిగినది చైతన్యమను ఆత్మ. బుద్ధి గ్రాహ్యత్వము ఆత్మయొక్క విశిష్టలక్షణము. ఆత్మచే సృష్టింపబడునవి లలితకళలు కావున నవి ఆధ్యాత్మికములుగా స్వీకరింపబడవలెను. కాగా అచేతనమగు ప్రకృతి కన్న లలితకళలే ఆత్మకు సన్నిహితములు. అనగా ఆత్మవ్యాపారముతో ఆత్మ లలితకళలలో సంవలితమగుచున్నది. లౌకికము, భౌతికము, సేంద్రియము, పరిచ్ఛిన్నమునగు ఆకృతిలో స్వసంవిత్స్వభావము నాత్మ అనుభవించుటయే లలితకళలయొక్క విశిష్టత. అనగా అసంగము, అవికారము, నిర్గుణమునగు తత్త్వము, సంగము, వికారము, సగుణమునగు రూపముతో అనన్యత్వము నందుచున్నది. కాగా ఆత్మ స్వానుభూతినేగాక, పరానుభూతిగూడా తనలో అంతర్లీనముగా చేసికొన గలుగుచున్నది. పరిచ్ఛిన్నములగు అనుభూతికేంద్రములలో (Finite centres of experience) అనగా వ్యక్తులలో- ప్రమాతలలో, నిత్య శుద్ధ, బుద్ధ, ముక్త బ్రహ్మ భాసించుటయే జగద్వృత్తి. ఏతద్వృత్త్యవగాహనమే లలితకళ. కాగా కావ్య జగత్తు అఖండార్థోపయోగి యగు మహావాక్యము (Judgement) వంటిది.

౧౦ కావుననే వామనుని మొదలుకొని కవికి ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసము లవసరమని ఆలంకారికు లనినారు, లోకశాస్త్ర కావ్యాద్యవేక్షణమగు వ్యుత్పత్తికి, కవిత్వబీజరూప సంస్కార విశేషశక్తి యగు ప్రతిభకుగల సంబంధము నాశ్రయించుకొనినది కావ్య ప్రయోజనము. అనగా కావ్య ప్రయోజనమేమనిన, కావ్యమునకు వ్యుత్పత్తికిగల సంబంధమేమని ప్రశ్నించినట్లగును, అనగా వ్యావహారిక జగత్తుకు కావ్యజగత్తునకునుగల సంబంధమేమి? కాగా భరత మమ్మటాదులవలన కావ్య ప్రయోజనములుగా చెప్పబడు యశస్సు, అర్థము, వ్యవహార వేత్తృత్వము, శివేతరక్షతి, సద్యఃపరనిర్వృతి, కాంతాసంమితోపదేశత్వము అనునవి సంస్కార విశేషముచేత, దేశకాలానుగుణముగా కావ్యమునకు సంభవించు ఉపయోగములే కాని, ప్రయోజనములు కావని తేలగలదు.

౨

౧ "అన్యలోకస్థములైన శుష్కభావ రూపములలో తత్త్వశాస్త్రము కాల

1. Hegel: Asdthetik — Introduction ప్రథమాధ్యాయము.

మును వ్యర్థముచేయదు. ప్రత్యక్షసిద్ధము, ఇహప్రతీయమానమయినదే తత్త్వశాస్త్రమున విచారింపబడు విషయము" అని హెగెల్ వచించినాడు. అనగా పారలౌకిక చింత వేదాంత శాస్త్రమున పనికిరాదు, కాగా ఈ లోకము, ఇచ్చటి సన్నివేశములు, ఈ పరిసరములలో మన జీవితముమాత్రమే జిజ్ఞాస్యవిషయములు. కావుననే ఉపనిషత్తులలోని సృష్టివాక్యములకు సృష్టిపరముగా అర్థము చెప్పరాదనియు, అద్వితీయ బ్రహ్మపరముగానే వాటికి సమన్వయమనియు అద్వైతవేదాంత పరిభాష పలుకుచున్నది, కావ్యవస్తువుకూడా ఎక్కడనో ఉన్న పారలౌకిక విషయ జిజ్ఞాస చేయదు.

౨ పరలోకము ఎక్కడనో దూరముగా నున్నదనియు, దానినెప్పుడో మనము ప్రవేశింప గలమనియు సామాన్యముగా పామరు లభిప్రాయ పడుదురు. లేనిచో మన జగత్తున కత్యంత భిన్నముగా ఉండి, కేవలము దుఃఖస్పర్శలేని సుఖముతోనున్నది స్వర్గమనియు- సుఖస్పర్శలేని దుఃఖభూయిష్టము నరకమనియు చెప్పగుదు. ఇంద్రియములచే నాలోకమును భూయమానముకాదు. శాశ్వతముగా ఆ లోకములో పుణ్యజనులు వసింతురని వారితోసహవాసమే మనవాంఛితమనియుకూడా వచింతురు. ఆలోక మాలోకమునకు దాదాపు సరిపోను నకలు అవవచ్చును. అనగా ఒక విధమైన పునరుక్తి ఆలోకములోనున్నది. వేదాంతమునకుకాని, లలితకళలకుకాని, కలతలకుగాని అట్టిలోకముతో సంబంధమేమియు లేదు.

3 లౌకికాలౌకిక జగత్తుల భేదము వాస్తవముగా నెట్టిదో గ్రహించిననే కావ్యమ లౌకిక మనుచో సత్యమగు నర్థము బోధపడగలదు. " ఆ సన్నివేశము జరిగినప్పటినుంచి నాకీ జగమే మారినది; ఆశక్తి నెరిగిన తరువాత నాకీ ప్రపంచము భిన్నముగా ప్రతీయమానమైనది" ఇత్యాది వాక్యములను సాధారణముగా మనము వినుటకలదు. అనగా మన ప్రత్యక్షసిద్ధమైన అనుభూతి మన దృక్పథమును మార్చి, జగత్తునుకూడా భిన్నముగా గోచరించుచున్నట్లు చేయుచున్నది. పరిశీలనాశక్తి సక్రమ శిక్షణచే వృద్ధినొందినవ్యక్తికి తన పరిసరములు నవనవార్థయుతములై భాసించగలవు. పరిసరములను దర్శించి, అనుభవించునట్లు చేయు మన మనస్సు,ఆత్మ, అపరోక్షాత్మకమైన జాగ్రత్ప్రపంచమును మనకై నిర్మించుటయేగాక, పరిసరములను కూడా క్రమానుసార మేర్పరచుచు, వినూత్నముగా సృష్టించుచున్నది. విషయోద్దిష్టమగు జ్ఞానమును సృష్టించుచున్న ఆత్మ విషయసృష్టినే చేయుననలేము. ధర్మశాస్త్ర జగమును, కళా ప్రపంచమును, రాజకీయ విశ్వమును పరిశీలించుచో ఈ లోకములలోని విషయములు మన జ్ఞానాకార చిత్తవృత్తి నాశ్రయించుకొని ఉన్నవని, తజ్జన్యములని చెప్పవచ్చును. ఈ విషయములు అతీంద్రియజగన్నిష్ఠములు. వీనిలో నొకవిధమున అనన్యత్వము కలదు.

౪ కళాప్రపంచములోని విషయముల అనన్యత్వము జ్ఞానమును (Thought) ఆశ్రయించుకొని ఉన్నది. భావావేశ ప్రయోజనాది సంవలితమైనదీ అనన్యత్వము. అనగా నిది మనోనిష్ఠము, ఆత్మనిష్ఠము. నేనను నేనగా భావించుటకు ఇంద్రియము లుపయుక్తములు కావు. మానస ప్రత్యక్ష మీభావనకవసరము మాత్రమేగాక, ఈ భావనా వ్యాపారాశ్రయమగు మనస్సుచే నీ విషయము నిర్మింపబడుచున్నది. జీవితములోని అనన్యత్వ విశిష్టములగు విషయ సన్నివేశములు అతీంద్రియములు. అనగానవి మానస

ప్రత్యక్షసిద్ధములు. బుద్ధిగ్రాహ్యములని కూడా వచింపవచ్చును. ఇట్టిజగత్తు మాత్రమే అలౌకికము, దివ్యము కూడాను.

౫ మానస ప్రత్యక్షమును ఇంద్రియ ప్రత్యక్షముతో భిన్నముగా గ్రహించి, సారూప్యవైరూప్యముల ప్రతిపాదించుట అసమంజసము, అయుక్తికము. ప్రత్యక్ష ప్రతీతిని పొందు చక్షురింద్రియములు సర్వదా మానస నేత్రమే. బుద్ధీంద్రియములు అత్యంత భిన్నములగు రెండువిషయములు కావు. బుద్ధీంద్రియములకు ఆత్మాంతఃపాతిత్వమున్నదని గ్రహింపక తప్పదు. కాని వర్ణాది గుణములను చూచు ఆత్మకు, చైతన్యమై, ఆత్మావలోకనము కలిగి, సౌందర్యమును దర్శించు ఆత్మకు భేదమున్నది. సౌందర్యప్రతీతి కల్గిన ఆత్మలో గుణప్రత్యక్షము కల్గిన ఆత్మ అంతర్లీనమై యుండును. అంతేకాని తద్విపరీత వృత్తిలేదు. ఇంద్రియార్థసన్నికర్షగల ఆత్మకు రక్తనీలాది వర్ణములు తాత్త్వికములైన బాహ్యవిషయములు. ఆత్మావలోకనగల ఆత్మకు సౌందర్యమునగల ఒకానొక అంశమే వర్ణము. అనగా ఇంద్రియాతీత జగత్తులో నంతర్లీనమైనది భౌతికజగత్తు. కావున బాహ్యజగత్తునకు గమనము, చైతన్యమును, ప్రాణమును, విశిష్టతను ఆపాదించునది, ఇంద్రియాతీతమగు విశ్వము. ఇదే అలౌకిక జగత్తు. దీనిని కావ్యమునకూడా మనము ఆస్వాదించుచున్నాము.

౬ లౌకికాలౌకిక జగములందువలన భిన్నములు కావు. వీనికి అవినాభావసంబంధమున్నది. లౌకిక జగమున అంతర్యామిగా అలౌకిక విశ్వము వర్తించుచు, బహిర్యామిగా గూడనున్నది. అనగా మన మందరము ఈ రెండులోకములలోను ఏ కొద్దిగనో గొప్పగనో వర్తించుచునే ఉన్నాము. కాని తాత్త్వికమగు అలౌకికజగమును సమగ్రము నాదర్శించి అనుభవించి తెలిసికొనిననే మానవుడు పురోగామి యగును.

౭ అలౌకికజగము అపరిచ్ఛిన్నము, శాశ్వతము, నిత్యము అనుటకలదు. అపరిచ్ఛిన్న, అనంత శబ్దములకు సంఖ్యాపరముగా అర్థము చెప్పరాదు. స్వతఃసిద్ధము, స్వతఃప్రామాణ్యము, సమగ్రము, సంపూర్ణమునైనది, అపరిచ్ఛిన్నమగు అలౌకిక జగత్తు. ఏకంవిధమైన అలౌకికత్వము ఇంద్రియాతీత విషయానుభూతిని గలిగిన చైతన్యమగు ఆత్మయే. ఆత్మ వికాసావేశములచే భాసములగు విషయములుకూడ నిట్టివే. అనగా అపరిచ్ఛిన్నము, సమగ్రము, స్వతఃసిద్ధమునైన ఆత్మయే ప్రత్యక్ష విషయము కాగలదు. కార్యకారణ సంయోగ సమవాయాదిసంబంధములద్వారా అన్యవస్తువునకు దారిజూపి అచ్చట పర్యవసించునది పరిచ్ఛిన్న విషయము. వ్యక్తిత్వముకలిగి, జ్ఞానాకారమై, సంపూర్ణమై స్వతఃప్రామాణ్యముకలిగినది అపరిచ్ఛిన్నమైన అలౌకికము. మతము, దేశము, లలితకళలు అనునవి అలౌకిక విషయములు. ఈ అలౌకికమే శుద్ధము బుద్ధము మాత్రమే కాక, ముక్తము కూడా. ఇచ్చటనే స్వేచ్ఛకలదు.

౮ దేహము భౌతికము, భౌతికరూపమును ప్రతీకగా ఆత్మ ఉపయోగించుచున్నది. మానవాకృతిలోనే అపరిచ్ఛిన్నమైన జ్ఞానము భాసించగలదు. చైతన్యమను సాధనముద్వారామాత్రమే ఆత్మప్రతీయమానమగును. తాత్త్వికమైన ఆత్మకు భౌతికవిషయము కేవలము సాధనము, ప్రతీక.

౯ మాంసమయి యగు స్త్రీ బాహ్యజగత్తులోనిది. గ్రుతచిత్తమున యీ విషయము విరక్షిప్తము కాగా చిత్తము తద్విషయాకారమును పొందుచున్నది. ఇది మనోమయియగు స్త్రీ. అంతరంగిక జగత్తుకు సంబంధించినదే స్త్రీ. బాహ్యలోకములోని స్త్రీకి వికా

రముపచ్చి, దేశకాలానుగుణముగా నామె మారినను, మనోమయియగు స్త్రీలో మార్పులేదు, అనగా మనోమయి దేశకాల ప్రమాత్రనియంత్రితయగు స్త్రీ కావుననే, లౌకికమగు సింహము భయకంపాదిహేతుకము; కాని కావ్యగతమగు సింహము శాకుంతలమునవోలె ఉత్సాహజనకమే యగుచున్నది. ఈమనోమయమైన విషయమే స్థాయియగుచు, విభావాదిసంవలితమై రసత్వము నందుచున్నది. అనగా మనోమయము లౌకిక తుల్యమైనను, అలౌకికమే.

౧౨ బాహ్యజగత్తు ఇంద్రియముల (understanding and sense) నాశ్రయించుకొని నియత మార్గానుసరించుచున్నదగుటచే, నది పరిచ్ఛిన్నమై నియమావళి ననుగమించిన జ్ఞానాకారమే (Thought, Knowledge) అనవచ్చును. మనోమయమగు కావ్యజగత్తు భావనామయమగుటచే, యథార్థమును సరిచూచక, స్వేచ్ఛగా ప్రవర్తించు జ్ఞానమే భావన. కావున ప్రవృత్తిలో మాత్రమే జ్ఞానము, భావన భేదించుచున్నవి. కాని స్వరూప స్వభావములలో నివి అభిన్నములే. ఏకాకారములని కూడా చెప్పవీలున్నది.

౧౩ భావనాశిల్పమగు జగత్తు వాస్తవిక జగత్తుతో సంబంధము వదలరాదు. చారిత్రకముగా, భౌతికముగా, భావనాజగత్తులోని వ్యక్తులకు, సన్నివేశములకు వాస్తవికత లేదు. కాని శాశ్వతము, నిత్యము, విశ్వజనీనము నగు మానవానుభూతికి, చైతన్యమునకు ప్రమేయముగా భావనావీధిలోని వ్యక్తులను మించిన చైతన్యము, శక్తి కలిగిన వ్యక్తులు లేనిన అతిశయోక్తి లేదు. కావ్యసృష్టిలో వాస్తవికత, సత్యత్వము, శాశ్వతత్వము ప్రతీయమానము లగుచున్నవి. కనుకనే లౌకిక జగత్తునకు కావ్యజగత్తే మూలమగుచున్నది.

౧౪ "నేను జీవించవలెనని కోరుకొనిన ప్రవృత్తిపరుడను కావలెను. ఇక్కడ, ఇప్పుడు ప్రతీయమానమగు జగత్తులోనే ప్రవృత్తికలదు. ఇంతకన్న ఉత్తమ సత్యముగల జగత్తులున్నను, అన్యజగమును ప్రవేశించవలెనని కోరలేను. ఈ జీవితము వృద్ధిపొందవలెననిన, ఈ జగమున బుద్ధిగ్రాహ్యమగు నియమత్వమును, విజ్ఞానమును, ధర్మవర్తనమును సంకోచింపవేద్యముగా చూసుకొనవలెననిన ఒకే ఒక మార్గమున్నది. ఇక్కడ, ఇప్పుడు ప్రత్యక్షానుభూతులలో ప్రతీయమానమగు దానితో బయలుదేరవలెను. ఈ ప్రవృత్తి నాధారముగా స్వీకరించియే విషయ నామగ్రి పలసినత్తమై, సత్యమగు జగమును నిర్మించవలెను. నాకు కావలసిన ప్రయోజనోపయోగములకై ఏక విధమైన జగమునే వాస్తవికమని నేనంగీకరించక తప్పదు. వీటన్నిటికిని అతీతమగు సత్యమున్నను, ఆ సత్యము నా జగములోనే నాకై అభివ్యక్తము కావలెను. నా జగము కాక తద్వ్యతిరిక్తమగు అన్యలోకము నాకేమాత్రము ఉపయోగించదు. అపరిచ్ఛిన్నతను నేను నాజగములోనే పొందగలను. దేశకాలాతీతమగు తత్త్వము నావిష్కరింపగలిగి, ఆ తత్త్వానుభూతి పొందగలిగిన జగమే నాకు వాస్తవమైనది." అని నాడు ప్లేటో. ఇట్టిది కావ్యజగత్తున కూడా కలుగుచున్నది.

3

౧ కావ్యాస్వాదనలో ప్రత్యక్ష ప్రతీతి లేదు. అనగా శబ్దార్థానిరతము, విభావానుభావాత్మకమునైన కావ్యమున పారంపర్యముగా రసస్ఫూర్తి కలుగుచున్నది. 'సర్వా చ ప్రమా ప్రత్యక్షపరా' అనిన వేదాంతులు ప్రత్యక్షాశ్రితములు మాత్రమేగాక సర్వప్రమాణములు ప్రత్యక్షముననే పర్యవసితములు కావలెను

న్నారు. ప్రత్యక్షప్రమా అనగా చైతన్యమేనని వేదాంతులు పల్కుచున్నారు. అనగా అంతర్యామిగా బహిర్యామిగా నున్న చైతన్యమే సర్వదా అనుభూతముగునున్న దనినారు. 'Reality is Experience' అనినాడు బ్రాడ్లే యనువేదాంతి. అనగా చైతన్యము సర్వత్ర ప్రకాశమానముగు నున్నది, పరిచ్ఛిన్నము కాగానే చైతన్యము నానారూపముల నందు చున్నది. ఈ చైతన్యమే బాహ్య వస్తువుల అస్తిత్వము. ఏతత్ప్రతీతి కావ్యమున గూడ కలుగక తప్పదు. కాని కావ్యమున సవికల్పక ప్రతీతి యుండుటచే నిది వాగంతస్యమని నాడు అభినవగుప్తుడు. కావుననే కావ్యానుభూతిని Subjective Mind అనినాడు హెగెల్. కాళిదాసు లలిత విజ్ఞాన మనినాడు.

౨. సాక్షాత్ప్రతీతి ఐంద్రియము. అలౌకికము. కాని కావ్యమున అలౌకిక రసప్రతీతి నైంద్రియముగా నున్నది. "శృంగారాభివ్యక్తిర్నేతు సుకుమారవిభ్రమ ద్యోతకాభినయయోగాదిభి ర్మధురమంథరవలనావర్తనా భ్రూక్షేప కటాక్షాదిభిర్వినా శృంగార రసాస్వాదస్య నామాపి న సంభవతి........ రౌద్రాద్భుత రసాభివ్యక్తావపి కర్తవ్యాయాం యోగ్యాభినయ ఉపాదీయతే సోప్యనుప్రాస వలనావర్తనాత్మక సుందర వైచిత్ర్య వ్యామిశ్రణాయా ముక్తి ర్నాట్య ఏవ వా న రసాభివ్యక్తి హేతు ర్భవతీతి సర్వత్రైవ కైశికీప్రాణా, ముద్యంక్త్యేతి 'అస్యశాఖా ప్రవృత్తించ వస్తూనా మ్యాభినయ స్యేతి' శృంగార రసస్యతు నామగ్రహణమపి నతయా వినా శక్యమితి"

అనినాడు అభినవగుప్తుడు. శృంగారాది రసములు అభినయాది వ్యాపారానుభూతి లేనిది ఆస్వాదన యోగ్యములు కావు. అనగా అలౌకికమగు రసమును అభివ్యక్తము చేయునది పరిచ్ఛిన్నమగు రూపము, ఆకారము. కాగా అతీంద్రియ రసము ఇంద్రియావచ్ఛిన్న రూపముతో సంయోగ మందిన గాని పరిగ్రాహ్యము కాదు. కావున కైశికిని ప్రాణముగా స్వీకరించినారు. కైశికి అనగా "కేశాః కించిదపూర్వ క్రియాజాత మిదన్వాత్యో హాశాభా సంయోగినః అద్వైతత్సౌందర్యోపయోగి వ్యాపార కైశికీవృత్తి" అని అభినవగుప్తుడు నిర్వచించినాడు. సౌందర్యము నభివ్యక్తము చేయుటకు ఉపయుక్తమగు వ్యాపారమే కైశికీవృత్తి. కాగా అలౌకికము, అతీంద్రియము, గుణాతీతము నగు రసము భావనిష్ఠము. లౌకికము. ఇంద్రియావచ్ఛిన్నము. సగుణము నగు రూపమును రసము పొందిన గాని తత్ప్రతీతి యోగ్యము కాదు. కాగా కావ్యమున సౌందర్యము తత్త్వము అతీంద్రియ సంయోగముద్వారా, ధ్వననాత్మకముగా అనుభూయమాన మగుచున్నది. అతీంద్రియ సంయోగాభివ్యంజితమగు అనుభూతియే లలిత విజ్ఞానమనబడు Subjective Mind.

౩. కావ్యము ఇంద్రియానుభూతిని ఉద్దేశించునదని నిర్వివాదము. ఇంద్రియ ప్రత్యక్షము, భావన లేనిచో కావ్యాస్వాదము కలుగదు. కావున కావ్యము ఇంద్రియావచ్ఛిన్న విషయము, అనగా లౌకిక విషయము. కాని కావ్యము ఆత్మనుగూడ ఉద్దేశించుచు, ఆత్మచే పరిణామమందుచు, ఆత్మలో నొకవిధమగు స్వాస్థ్యము నందుచున్నదని విస్మరించరాదు: కాగా కావ్యము ప్రకృతికన్న విలక్షణమై లౌకికాలౌకిక మగుచున్నది.

౪. కేవలము లౌకికముగా కావ్యమున కస్తిత్వము లేదు. అతాద్రూప్యమే కావ్యమున భాసించగలదు. కేవలము ఇంద్రియానుభూతిలో చక్షుశ్శ్రవణేంద్రియములు

పొందుచున్నవి. ఇట్టి విషయమున ఆత్మకు తుష్టి కాని, ప్రవృత్తిగాని లేదు. సంవిత్సంవేద్యముగా ఆత్మ యే సర్వవిషయములను దిద్దుకొనుచుండును. దీనితో విషయాకారమగు చిత్తవృత్తి బయలుదేరగా స్వార్థవృత్తి కూడా కలుగుచున్నది. దీనికే కామవృత్తి అనవచ్చును. కామవృత్తి విశిష్టుడైన ప్రమాత పరిచ్ఛిన్నుడై పరిచ్ఛిన్న విషయములను ప్రమేయములనుగా గ్రహించుచున్నాడు. వీనితో ఆత్మావేశమగు చైతన్య విజ్ఞానానుభూతినందక కామావృతుడగుచున్నాడు. కాగా స్వార్థమగు ఆనందమునకై విషయ చైతన్యమును నశింపజేయుచు, విషయములను పరిచ్ఛిన్నములుగా, ప్రత్యేకములుగా స్వీకరించుచు కామోపహతుడు కాగా, విషయములు ఇంద్రియావచ్ఛిన్నములు కాక తప్పవు. అనగా బాహ్యజగత్తును సాక్ష్యముగా గ్రహించక స్వార్థతుష్టి సాధనముగా స్వీకరించుచున్నాడు. పరిచ్ఛిన్నము, లౌకికము, సేంద్రియమునగు విషయములలో వ్యాప్తుడగు ప్రమాత వానిలో నవినాభావసంబంధము నందుచున్నాడు. కనుకనే తన అతీంద్రియాపరిచ్ఛిన్న సత్యత్వమును విస్మరించుచు స్వేచ్ఛను కోల్పోవుచున్నాడు. బాహ్య విషయముచే ప్రమాత అధ్యవసితుడగుచున్నాడు. కాని కావ్య ప్రపంచమున ఈవిధమగు సంబంధము లేదు. కావ్యమలౌకికము, స్వేచ్ఛాన్వితము నగుటచే నిష్కాముడగు ప్రమాత కావ్యప్రపంచమును ప్రవేశింపగలుగుచున్నాడు. అనగా కేవలము ఇంద్రియావచ్ఛిన్నమై కావ్యముండరాదు, ఉండలేదు.

౫. జ్ఞానాకారిక చిత్తవృత్తితో కూడ బాహ్యజగత్తుకు మనకు సంబంధము కలుగుచున్నది. అపరిచ్ఛిన్న విషయములో వ్యాపృతమై, తదంతర్యామి నన్వేషించి, తన్నియమగతిని కనుగొని, తదస్తిత్వాకారమున వానిని భావనచేయునది జ్ఞానాకారవృత్తి. అనగా నీవృత్తి ఉపాధ్యవచ్ఛిన్న విషయములను, సేంద్రియములగు వానిని పరిత్యజించును. జ్ఞాన మపరిచ్ఛిన్న ప్రమాతృనిష్ఠమగుటచే ఉపాధి సంవలిత విషయములకు వ్యక్తిత్వ మాపాదించలేదు. ఈ జ్ఞానాకారవృత్తితో బాహ్య జగత్సంబంధి కాగా, ఈజ్ఞానమే ప్రకృతిలో చైతన్యము ననుభవించి, ఆత్మవికాసము నందజేయుచున్నది. అనగా బాహ్యవిషయము ఆత్మాకారము నందుచున్నది. కాగా లౌకికము, సేంద్రియమునగు వస్తువు అలౌకికము, అతీంద్రియమునగు తత్త్వమున పరిణతమై తద్రూపమునంది చైతన్యావచ్ఛిన్నమగుచున్నది. కావున కావ్యజగత్తు బాహ్య విషయమును సేంద్రియముగాను, అతీంద్రియముగాను స్వీకరించుటచే, ఏవిశ్వము లౌకికాలౌకికమగుచున్నది.

౬. కాని కావ్యజగత్తులోని సేంద్రియత్వము తాత్త్వికముగాను ఆభాసగానే మెలగును. కావ్యజగములోని ఇంద్రియావచ్ఛిన్నాకృతిలో కామవృత్తి శిథిలమైనను అవయవ సౌష్ఠవాదులు కాని, జ్ఞానవృత్త్యపేక్షితమైన అపరిచ్ఛిన్నత కాని ఆత్మచే అన్వేషింపబడవు, పరిచ్ఛిన్నత పరిచ్ఛిన్నతగా ప్రతీయమానమగుచు అపరిచ్ఛిన్నతలో సమన్వయమును నందుటయే ఆత్మకు కావలసినది. అనగా లలిత కళలోని శరీరత్వము సహజ భౌతిక శరీరమునకు ప్రతీతి యగుటచే లౌకిక ఇంద్రియావచ్ఛిన్నాకృతికి అలౌకిక జ్ఞానమునకు కావ్యజగమే సమావేశస్థలముగా ప్రతీయమానమై లౌకికాలౌకికములకు గల పరిణామమును సులభముగా అవగాహనము చేసికొనుటకు వీలుకలుగజేయుచున్నది.

# కావ్యజగత్తు

౭ కావ్యగత శరీరత్వము రూపముగాను దృశ్యముగాను శ్రవ్యముగాను బాహ్యాత్వమున కనపడుచున్నది. కాని విషయముల భౌతికత్వమును ఆత్మ మార్చ యత్నించదు; వాని అంతర్ముఖ్యమ్ము కూడా కాదు. అంతరంగిక సూక్ష్మావలోకనము చేసినచో, వస్తువుఆత్మ చైతన్యావచ్ఛిన్నమగును గనుక విషయము విషయముగా ప్రతీయమానము కాలేదు. కావుననే కావ్యజగముయొక్క ఇంద్రియావచ్ఛిన్న (అనగా భౌతిక) రూపము చక్షుశ్శ్రవణేంద్రియములకే సంబంధించియున్నది. మిగిలిన ఇంద్రియములు కావ్యాస్వాదమున కుపకరించవు. అందుచే నాట్యము దృశ్యశ్రవ్యాత్మకమని భరతుడనినాడు.

౮. పదార్థ (మేటర్) సంబంధము కలిగిన ఘ్రాణరసేంద్రియములు తత్తత్పదార్థములలో సాక్షాత్ప్రతీయమానములగు ఇంద్రియాత్మక గుణముల నాశ్రయించుకొనినవి. అనగా పదార్థాస్తిత్వము ఘ్రాణరసనేంద్రియముల నాశ్రయించుకొనినది కనుకనే అనన్యాశ్రితము, స్వయంప్రకాశమునగు కావ్యజగమున ఈ ఇంద్రియములకు ప్రవేశయోగ్యత లేదు. కాగా కావ్యలోకమున భావనా విలసితములు, లౌకిక జగద్విలక్షణములు నగు విషయసన్నివేశములే అదృష్టించ గలవు. ఆధ్యాత్మిక పరిపోషణయే ఈ సామగ్రియొక్క పరమప్రయోజనమగుటచే ఆత్మలో అంతర్లీనములగు భావములు కావ్యాస్వాదమున పైకి ఉబుకుచున్నవి. చైతన్యము ఉప్పొంగగలుగుచున్నది.

౯. కావున ఆత్మచే పరిష్కృతమై, ఆత్మ సంస్కార విలసితమై, ఆధ్యాత్మిక శక్తిచే నావిర్భూతమైనదే కావ్య వస్తువు. ఈ కావ్య జననవ్యాపారము స్వాత్మగతము. చిత్తవృత్తి విషయాకారము కాగా బాహ్యజగత్తు భావనద్వారా మనోమయము కూడా అగుచున్నది. కావున కావ్యజననక్రియ ఆత్మవృత్తితో నుండుటచే నిర్వికల్పము. కవిచిత్తము విషయాకారము నందుటచే సవికల్పము కూడా నగుచున్నది. అనగా కవిలో ఆధ్యాత్మికము వృత్తులు అనన్యముగా, ఏకత్వముననే విలసిల్లునవి.

౧౦. ఏవంవిధమగు భావన ప్రతిభనాశ్రయించుకొనినది. అనగా ఉత్తమ భావన కూడా నవనవోన్మేషశాలిని యగుప్రజ్ఞయే, కాగా భావన సశరీరముగానే ఆవిష్కృతమగుచు, అశరీరమగు తత్త్వమున అవచ్ఛిన్నత్వము నంతర్లీనము చేసికొని, తత్త్వము నభివ్యంజించును. ఇదేవిధముగా కావ్యార్థము కూడా లౌకిక పరిచ్ఛిన్నతను పూర్తిగా వదలలేదు, కావుననే కావ్యము ఆత్మేంద్రియములతో సంవలితమైనది, అనగా లౌకికాలౌకికమైనది కావ్యము.



# శ్రీ జనార్దనరావు

శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు

ఒకప్పుడు తంబుచెట్టి వీధిలో "భారతి" ఆఫీసులో గన్నవరపు సుబ్బరామయ్యగారితో ప్రసంగం ముగించి బైటికి వచ్చాను. అక్కడే ఉన్న ఒక ఆసామీ నాతోబాటు తానూ బైటికి వచ్చాడు. ఎలా పోల్చుకున్నానో ఇప్పటికీ నాకు తెలియదు. అతను ఫలానా అని దృఢనిశ్చయం కలిగింది.

సుబ్బరామయ్యగారితో సంభాషణవల్ల "అతని"కి నేనెవరినో తెలిసింది. అంతసేపూ అక్కడే కూర్చున్న అతన్ని నేను చూసీ చూడనట్లు ఊరుకున్నాను. ఎవరో ఉద్యోగస్థుడు అని మాత్రమే అనుకున్నాను. "అతను" అని మాత్రం నాకప్పటికి తెలియదు.

తంబుచెట్టినుంచి చైనాబజారు వీధిలోకి వచ్చానో లేదో అతను వెనకనుంచి నాభుజం తట్టి "మీ పరిచయం చేసుకోవాలని ఉంది" అన్నాడు. అప్పుడే నాకు "అత" నెవరో ఎవరూ చెప్పకుండా తెలిసింది.

"మీ పేరు కొంపెల్ల జనార్దనరావు కాదా" అన్నాను. జనార్దనరావుతో అదీ నా ప్రథమ పరిచయం, ఆక్షణంలో అతన్ని చూడగానే "గానము విపంచికను మీరె" అనే పద్యం జ్ఞాపకం వచ్చింది ఆపద్యంతో అతణ్ని ముడిపెట్టి "కొంపెల్ల జనార్దనరావువి నువ్వే" అని కచ్చితంగా అనేశాను.

తర్వాత నేను మద్రాసులో చదువుతున్న రెండేళ్ళూ ఎన్నోసార్లు అతనితో కలిసి సంచరించాను. మద్రాసులోనే తొలిసారి నేను, అనేకులు వాఙ్మయ వ్యక్తులను కలుసుకున్నాను. బసవరాజు, నండూరి, మల్లంపల్లి, వేటూరి, ముద్దుకృష్ణ, విశ్వేశ్వరరావు ఇత్యాదయః. సోమశేఖరశర్మగారి యింట్లో నేనూ జనార్దనరావూ మొదటిసారి నండూరి ముఖస్థంగా యెంకిపాట విన్నాము. విశ్వనాథ "కిన్నెరసానిపాటలు" వింటూ మైమరచిపోయాము.

నేనూ, విశ్వేశ్వరరావూ, జనార్దనరావూ కలిసి. హైకోర్టు బీచిలోనూ, రామకృష్ణా లంచిహోము లోనూ, అడయారు కన్నెమరా లైబ్రరీ లోనూ, పరుశవాకం—ఎగ్మూరువగైరా వీధుల్లోనూ విశ్వసాహిత్యపు సరిగమపదనిసలు సవరించాము.

జనార్దనరావు "భుజగభూషణా" అనే కీర్తన పాడుతూవుంటే నేను తన్మయుణ్ణ

యాను. అతను సంగీత విద్వాంసుడని కాదు. అతని గొంతుక బాగుంటుందనీ కాదు. అసలతను పాడేటందుకు కాదు– ఆ సాయంత్రం మేము భవిష్యత్తులో పొదగదలచిన కొన్ని బంగారపు కోడిగుడ్లకు శంకుస్థాపన చేశాము. ఆ పునాది మీద లేచిన పొగమంచు భవనం జనార్దనరావు పాట. అది అప్పుడే అదృశ్యమయింది కాని, ఎప్పటికీ అదృశ్యం కాదు.

౧౯౩౭లో మొదటిసారి జనార్దనరావును చూశాను. ౧౯౩-లో అతని ఆఖరు ఉత్తరం చదువుకున్నాను.

జనార్దనరావుని క్షయరోగం పట్టుకుపోయిన తర్వాత ''వీణ''లో అతని కొరకు తర్పణం విడిచాను. నా ''మహాప్రస్థాన'' సంపుటం అతనికి అంకితం ఇచ్చాను.

''తలవంచుకు వెళ్ళిపోయావా నేస్తం, సెలవంటూ ఈ లోకాన్ని వదలి'' అంటూ ఒక అంకితపు గీతం వ్రాశాను. ఈ అభినయాలు మినహా ఇంతకంటె నేను జనార్దనరావుకోసం చేసిందేదీ లేదు. ''ఉదయిని'' సంచికలతో ఊరేగడం, చందాలు వసూలు చెయ్యడం మొదలైనవి జనార్దనరావుకోసం కాదు. సాహిత్యంకోసం.

బరంపురంలో మొదటిసారి నవ్యసాహిత్య పరిషత్తు సమావేశమయింది. (అప్పటికది ''అఖిలాంధ్రకవి పండితసభ'') చింతా దీక్షితులుగారితో నా మొదటిపరిచయం అప్పుడే. నాలో పాతరాతయుగం పోయి, కొత్తయుగం ప్రవేశిస్తున్న రోజులు. జనార్దనరావూ, నేనూ కలిసి సాయంత్రం కాగానే ట్రంకురోడ్డు మీద షికారు తిరిగి వచ్చేవాళ్ళం. అప్పటికి మా సంభాషణ సారాంశం మాత్రమే నాకు జ్ఞాపకం ఉంది. ''ఉదయిని'' ప్రారంభిస్తాను. నువ్వా చెన్నపట్టణం రా అన్నది, జనార్దనరావు పాడిన పల్లవి. అతని పాటపూర్తి అయిపోయేదాకా నేను చెన్నపట్టణానికి వెళ్ళడం పడింది కాదు. ఈలోపున సుమారు పదేళ్ళ పాటు ప్రధానంగా విశాఖపట్టణంలో ''బీభత్సాలను అనుభవాలలో నడిపోస్తూ'' విషాదాన్ని కవిత్వంలోకి తర్జుమా చేస్తూ ఆవేశాలకి ఆకారాలు వెదుకుతూ మహాప్రస్థానం సాగించాను. అప్పుడప్పుడు కాకినాడ, బెజవాడ, బందరు మొదలైన చోట్ల జరిగిన సాహిత్య సభలలో, ఒకే సభకి ఇద్దరం వచ్చిన సందర్భంలో, లేదా, ఆంధ్రదేశ పర్యటన సందర్భంలో, జనార్దనరావు విశాఖపట్టణం వచ్చి (నేను కూడా ఊళ్ళోనే ఉన్నప్పుడు, మేము ముఖస్థంగా ముచ్చటించుకొనే వాళ్ళం. తరుచు ఉత్తర ప్రత్యుత్తరాలలో మా గొడవలు వెళ్ళబోసుకొనే వాళ్ళం.

''ఉదయిని''ని ఉన్నత వీథులలో నడిపించాలనీ, నవ్యాంధ్రసాహిత్య (కనీసం, కవిత్వ) చరిత్ర రాయాలనీ, యువలోక

స్వప్నాలకు ప్రాణప్రతిష్ఠ చెయ్యాలనీ, ఇలాంటివే ఏవో సంకల్పాలు చెప్పుకునేవాళ్లం.

నాకొకందుకు సంతోషంగా వుంది. ద్వితీయ మహాయుద్ధాన్ని చూడకుండా వెళ్ళిపోయాడు జనార్దనరావు. (లేక జనార్దనరావు ఉన్నంతకాలం, భయంవేసి ద్వి. ప్ర. మహాయుద్ధం రావడం మానేసిందేమో!). జనార్దనరావు నిష్క్రమించిన తరువాత, ౧౯౩౮ లో నేను ఆంధ్రప్రభ గొడుగుకింద చెన్నపట్టణంలో పునఃప్రవేశించాను. నాతోపాటు అధివాస్తవికతకి సంబంధించి కొన్ని పుకార్లు మోసుకొచ్చాను, "అశాంతి" అనే పత్రిక పెట్టాలనే అభిప్రాయం ఒకటి నా మెదడు పొరుగు అడుగుపొరలలో మెదల్తూ ఉంది.

జనార్దనరావు హత్యలో మొదటి ముద్దాయి చెన్నపట్టణం. మరాఠీకి బొంబాయి, బెంగాలీకి కలకత్తాలాగ తెలుగువాడికి మద్రాసు మాతృస్థానం కాదు. ఇక్కణ్నుంచి కాకిబంగారం తప్ప ఇంకో సరుకు ఎగుమతి చెయ్యడానికి వీలు లేదు. నాది అని చెప్పుకొనే "మహానగరం" లేనంతకాలం తెలుగువాడు తన మహాభారతాన్ని ప్రదర్శించలేడు!

తెలుగువాడు ధారాళంగా తాండవించగల మహానగరాలు రెండే కనబడుతున్నాయి నాకు. ఒకటి చెన్నపట్టణం. రెండు భాగ్యనగరం అనబరగే హైద్రాబాదు. అయితే చెన్నపట్టణానికి అడుగుభాగం అడుసు, హైద్రాబాదుకి పైకప్పు కంటక కిరీటం! అంచేతే ప్రస్తుత పరిస్థితులలో మద్రాసు నుంచిగాని, హైద్రాబాదునుంచిగాని మహాకవుల ఆవిర్భావం అసంభవం. తెలుగుదేశం నుంచి ఏదైనా ఒక ప్రతిభా కిరణం ఈ స్థలాలలో ఎదగడానికి వచ్చినా త్వరలోనే అది అపస్వరాలు పలకడమో అసలే మూగపోవడమో జరుగుతుంది. ఇందుకు రెండుదాహరణాలు. ఒకటి హైద్రాబాదులోని అపస్వరం. రెండు మద్రాసులోని మౌనం.

అయినా చెన్ననగరాన్ని భాగ్యనగరాన్ని తెలుగువాడు వదలిపెట్టకూడదు. వీటిని పూర్తిగా తెనిగించడమే ఆంధ్రుల ప్రధాన కర్తవ్యం! ప్రథమ కర్తవ్యం!

జనార్దనరావుని చెన్నపట్టణం ఎలా చంపిందో చెప్పాలా? ఊహూఁ! నాది స్వీయచరిత్ర, డిటెక్టివు నవలకాదు!

నా 'అనంతం' నించి

# శుకజనక సంవాదము

శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మ

శుకుడు తన నగరానికి వచ్చిఉన్నాడన్న సంగతి జనకునికి తెలిసి, మంత్రి పురోహితులతోకూడా అతనిని సమీపించి, అర్ఘ్యమూ పాద్యమూ ఇచ్చి, క్షేమ సమాచారాలు తెలుసుకుని పాలిచ్చే గోవును ఇచ్చాడు. అంత గౌరవించిన జనకుని శుకుడు తగినవిధంగా ప్రశంసించాడు. అప్పుడు జనకుడు—

ఓ తాపసోత్తమా! నీకు వయస్సెంతో లేదు. నూనూగు మీసాలతోవున్నావు. అయినా నీ ముఖవైఖరి వైరాగ్యాన్ని వెదచల్లుతూఉంది, నీ వంటి నిస్పృహగా వుండడానికి కారణమేమిటో, ఇలా ఎందుకు వచ్చావో? అన్నాడు.

అందుకాతడు— ఓరాజా! మాతండ్రిగారు వ్యాసులు. ఆయన నాకు ఉపనయనం చేసి, సకలవిద్యలూ నేర్పించారు. అలా చదువుకుని ఇటుతరాగానే పెళ్లి చేసుకోమన్నారు. ఆమాటకు నాశరీరం కంపరమెత్తిపోయింది. చెప్పరాని భయంవేసింది. అదిచూసి వారు- గృహస్థాశ్రమం చాలా గొప్పదనీ, ధర్మార్థకామమోక్షసాధనమనీ, విధిగా వివాహం చేసుకోమనీ చాలాదూరం బోధించారు. అలా వారెంత బోధించినా నాహృదయం దానికెంతమాత్రమూ అంగీకరించలేదు. అప్పుడాయన మిథిలకు వెడితే నీకు సందేహ నివృత్తి అవుతుందని చెప్పారు. అందు నిన్ను చూడవచ్చాను. మోక్షాపేక్షలో ఉన్న నేను చేయవలసిన పనేమిటో వివక్షితగా చెప్పు, అన్నాడు

అప్పుడు జనకుడు— ఓ బ్రాహ్మణోత్తమా! మోక్షార్థులయినవారు— ముందుగా ఉపనయనం చేసుకుని, వేదం చదువుకుని, గురుకట్నం చెల్లించి, వారి ఆజ్ఞాప్రకారం వివాహంచేసుకుని, సదాచారపరులై, న్యాయంగా ధనసంపాదించి, కర్మలుచేస్తూ సంసారం చెయ్యాలి. కొడుకుల్నీ, మనుమల్నీ కనాలి. అటుమీదట వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించి వనంలో తపస్సుచేసి ఇంద్రియాల్ని జయించాలి. నిత్యాగ్నిహోత్రాన్ని తనలో భాసిల్లేట్టు చేసుకుని సంసారాన్ని త్యజించి, విరాగి కావడానికి తురీయాశ్రమాన్ని చేరాలి. అంతేగాని, మొట్టమొదట సన్యసించకూడదు. అది శాస్త్రసమ్మతంకాదు. విరక్తివల్ల పరిశుద్ధుడైన వాడే సన్యాసానికి అర్హుడు. అలాకానివాడు

కాదు. వేదవేత్తలు నలభై ఎనిమిది సంస్కారతులు చెప్పారు. అందులో గృహస్థునకు నలభై, సన్యాసికి ఎనిమిదీ విధించారు.

అనగానే శుకుడు— పండితుడయిన మనస్సు పుట్టుకతోనే విరక్తి పొంది వుంటే మంచికాదా?

దానికి జనకుడు— అలా సన్యసించగానే సరిపోదు. బలవంతమైన ఇంద్రియాలను జయించడం కష్టం. అవి ఎలాంటి పండితుని అయినా నిమిషంలో లొంగదీస్తాయి. అందులో ఆరితేరనివాళ్ళగతి అడుగుతావా! అనుక్షణమూ వాళ్లని వెర్రివికారాలెత్తిస్తాయి. సన్యసించిన తర్వాత భోజనమూ, భోగమూ, భార్యా మొదలయినవి కావాలంటే దొరకవు. కోరికలు నరజన్మకు అనంతంగా బయలుదేరుతాయి. అందువల్ల వరుసగా సకలభోగాలూ అనుభవించిన తర్వాత నెమ్మదిగా వాటిని పరిత్యజించాలి. అంతే కాని, గుభాలున విడిచిపెట్టకూడదు. అలా చేస్తే ఎగిరిన బంతి దఢీలున క్రిందపడినట్టు అవుతుంది. సన్యసించినవాడు మళ్లీ భోగాసక్తుడైతేమట్టుకు వానికి శాశ్వతనరకం తప్పదు. ముమ్మాటికి భ్రష్టుడవుతాడు. చెట్టుమొదటనున్న చీమ మెలమెల్లగా ప్రాకి దాని చివరకుపోయినట్టుగానే జ్ఞానాన్ని సంపాదించి వైరాగ్యాన్ని పొందాలి. అలా కానినాడు ఉభయభ్రష్టుత్వమే. తుర్రున పోయే పిట్టలాకాకుండా నెమ్మదిగా పోయే చీమలాగు ఉత్తమపదాన్ని పొందడం చాలా మంచిది. తొందరపడినందువల్ల ఏలాభమూ వుండదు. మనస్సును జయించేవారంటూ లేరు. దాన్ని నెమ్మదిగా మంచిమార్గంలో పెట్టి నిగ్రహించాలి. ఇంద్రియవిషయాలు అనుభవించకుండా బిగించుకు కూర్చున్న వారిని; అవి ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కొంటాయి. పరమ ప్రశాంతంగా గృహమందే ఉండి, తనకు తగినరీతిగా సంచరిస్తూ, లాభాలాభాలకు సంతోషమూ, దుఃఖమూ లేకుండా, విహితకర్మలాచరిస్తూ, నిత్యసంతుష్టుడూ, త్యాగీ అయినవానికి విధిగా మోక్షం చేకూరుతుంది. ఇదిగో, నాసంగతి చూడు. నేను సకలభోగాలూ అనుభవిస్తూ ప్రజానుకూలంగా రాజ్యపరిపాలన హాయిగా చేస్తూ, నిర్మలహృదయంతో ప్రవర్తించడం వల్ల విదేహముక్తుడుగావున్నాను. నాలాగే నీవుకూడా భోగాలూ, సుఖాలూ అనుభవించు. ఆత్మవస్తువుకు రంజనంఅంటూలేదు. దానికి సాటిలేదు వికారం లేదు. దాన్నెవరూ చూడలేరు. కావున ప్రకాశించడానికి అవకాశంలేదు, నీకు బంధనవిషయం తెలియదా? జపతపాలు చేసినా, సకలతీర్థక్షేత్రాలూ సంచరించినా, పరిశుద్ధచిత్తులు కానివారు చేసినపను లెందుకూ పనికిరావు. చిత్తశుద్ధిలేక చేసినపని

-చిక్కులకేకాని మరి దేనికీపనికిరాదు. నేను, నీవు, నాది, నీది అనేవిషయమే బంధనానికి కారణం. దీనికికారణం మనస్సు, అలాంటి మనస్సు నిర్మలంగానూ, సమానంగానూ వుంటే బంధమేవుండదు. అప్పుడు మోక్షానికి లోపమేమున్నదీ! వీడు శత్రువు, వీడు మిత్రుడు అనే తారతమ్యం మనస్సువల్ల కలుగుతూవుంది. అదియావత్తూ అజ్ఞానంవల్ల వస్తూవున్నదే. జ్ఞానమే కానివుంటే తారతమ్యాలువుండవు, జ్ఞానంరావాలంటే అజ్ఞాన కార్యాలన్నీ అనుభవించాలి. ఎండవల్ల వడగొట్టినవానికి చెట్టునీడ సంతోషాన్ని ఇచ్చినట్లు, నీడనున్నవానికి అది తెలియదుకదా! భూతాలు భూతాలలోనూ, ఇంద్రియాలింద్రియాల్లోనూ, గుణాలు గుణాల్లోనూ కలిసిపోయిననాడు ఆత్మకేదోషమూ లేదు. లోకమర్యాదల్ని వేదాలు బోధిస్తూవున్నాయి. వాటిని బహిష్కరిస్తే ధర్మం నాశనంఅవుతుంది. ధర్మం నాశనమైతే వర్ణాశ్రమాచార పద్ధతులు అడుగంటుతాయి. కావున వేద విహిత కర్మలాచరిస్తూవుండాలి.'

'నా దేవీభాగవతం'నుంచి



# కళ - దాని జాతీయ ప్రాముఖ్యత

స్వర్గీయ శ్రీ మంగిపూడి పురుషోత్తమశర్మ

[పురాణాలు వ్యవహారికంలో అనువదించడం ఎంత సుకరమో ఈ రచన తెలియచేస్తుంది — సంపాదకులు]

ప్రస్తుత కాలమున మానవులందములగు వానికి తక్కువ గౌరవమును, ఉపయోగకరములగువాని కధిక గౌరవమును కలిగింప జూచుచున్నారు. కాని పాశ్చాత్యులు తమ విద్యావిధానములో సౌందర్య గ్రహణమునకు గొంత శిక్షణమొసగుచు తమ విజ్ఞాన సంప్రదాయములను నిలుపుకొనుచుండుటచే వారియందీదోషము తగ్గుచున్నది. మన విద్యాశిక్షణ మాత్రము [illegible]తము. పూర్వ సంప్రదాయములనుండి మనము వేరు చేయబడితిమి. ఐనను మనలో నింకను పూర్తిగ నాశముగాక నణగియున్న ఆధ్యాత్మిక సౌకుమార్యము, భావనాపటిమ యనువాని మూలమున మన యందును నీదోషము ప్రబలుటలేదు. నేటి మానవుని దృష్టిలో ప్రపంచము ఒక చీమలపుట్ట! ఒక తేనె పట్టు! ఇట్టి దృష్టికి ప్రాచీనులు గాంధర్వగలిత కళలకొసగిన గౌరవము అర్థముకాదు.

మనుజునిలో శరీరము, ప్రాణము, చిత్తము, మనస్సు, బుద్ధి, ఆత్మ యను విభాగములు కలవు. మానవజాతి ప్రాదుర్భవించినది మొదలు ఒక్కొక్క భాగము ఒకటి వెనుక నొకటి క్రమవికాసమునంది ప్రాధాన్యమును వహించుచున్నది. అందులో మానవునకు కావలసినవి అన్నవస్త్రములు. ముఖ్యావశ్యకములగు వీనిని సర్వజనులకు సమముగ కలిగించు నేర్పాటులు కొన్ని ప్రాచీన సంఘములు చేసినవి. కాలక్రమమున ప్రాణికోశము వికసించినది. కేవల పశువాంఛలకంటె నుత్తమములగు కోరికలనది కోరినది. మనుజులలో సౌందర్యమును, ఆహార పానీయములందు రుచిని, ప్రత్యేకముగ స్వకీయమగు సంపదను కోర నారంభించిరి. జనసామాన్యములో పలువురు బానిసలై నికృష్టములగు వానితో తాము సంతృప్తి నందుచు పైకివచ్చిన ప్రతిభాశాలురయొక్క విశేష భోగములను సమకూర్చుచుండిరి. ఆవిధముగా కొందరు బానిసలుగను మరికొందరు ప్రభువులుగను మారిరి. అసమత్వము, ఈర్ష్య, అసూయ, అన్యాయము, అహంభావము మున్నగు నరిష్టములు తలసూపినవి. అవి దుర్గుణములయ్యును మానవ జాతీయాభ్యుదయమునకవి ఆవశ్యకములైనవి. జగన్మాత మంచిచెడ్డలను రెంటిని తన పనికి సాధనములుగ నుపయోగించుకొనును. [illegible] చెడుగువలన చిరస్థాయియగు మంచిని కలిగించును.

తరువాత బుద్ధి మెలకువొంది చిత్తవృత్తులు తీగలు సాగినవి. ప్రేమ, ద్వేషము, కక్ష, క్రోధము, రాగము మున్నగునవి యంకురించినవి. కాని చిత్తమంతయు ప్రాణకోశములో నింకను మునిగినది. ఈ మిశ్రమమునే నేడు పాశ్చాత్యులు హృదయమని వ్యవహరించుచున్నారు. అదివరకు సాంఘికములుగనున్న ప్రాణవాంఛలు వ్యక్తులయందు ప్రత్యేకతను పొందినవి. ఈ వాంఛాపూర్తికే నేడు ప్రపంచములో మానవ శక్తులు పనిజేయుచున్నవి. విజ్ఞానశాస్త్రము, వాణిజ్యము విశేషవ్యాప్తినొంది దానికి సహకారులగుచున్నవి. ఈ భోగాపేక్షయే లేనియెడల మానవ

జాతి తన ప్రథమమును అధమమును నగు దశను దాటకుండెడిది.

తదనంతరము ప్రజలలో హృదయము వికసించినది, తత్త్వశాస్త్ర నీతిశాస్త్రములు మనుజులను ప్రబోధించినవి. సర్వజనులకు సౌఖ్యము సమానముగ కలిగించుట, ధర్మమని గ్రహించిరి. బానిసపద్ధతి యధర్మమని దానిని తొలగించి దాని స్థానమున లంచమో, జీతమో యిచ్చి సేవకులచే స్వేచ్ఛాపూర్వకముగు సేవ చేయించుకొన నారంభించిరి. కాని యీ పద్ధతియు నికముందు పనిచేయలేని స్థితికివచ్చినది. ప్రభువులును ధనికులునగువారు చెలాయించు నధికారము, భోగములు ననుభవించుటకు తమకును హక్కుకలదని నేడు సర్వమానవులును చెప్పుచున్నారు. జోడింపరాని వేయైనను సాధ్యమగునంతవరకు రాజకీయ స్వాతంత్ర్యమును, సర్వసమత్వమును ప్రతివ్యక్తికిని కలిగించియే తీరవలెను. ఈ స్వాతంత్ర్యకాంక్షయే రక్తవర్ణముతో రౌద్రాకారమునుధరించి కన్నులుకప్పి పరాసు విప్లవముగా ప్రజ్వలించినది. ఇది ప్రజాపాలనము. ఈ సాంఘికత్వమును, ఈ యరాచకతను చూచి యీ ధనికులు, యీ అదృష్టజాతకు లెంతగ తమ మొగములు చెండుకొని తూలనాడినను, వారు కొంతకాలము మాత్రమే దానిని నిరోధింపగలరు. వార యనుభూతి పూర్వమునుండియు పూజనీయమై యుండునుగాక, గతించిన యుగములువారికి గౌరవప్రపత్తులు కలిగించియుండునుగాక. కాని భవిష్యత్తు భూతకాలముకంటె విశేషశక్తికలది. అవసరముమాలిన ప్రాతవాని నన్నిటిని, నిర్దాక్షిణ్యముగ ముక్కలు ముక్కలుగ నడగద్రొక్కుచు పరిణామచక్రము తన త్రోవను తాను దొరలిపోవును. ఆమహాశక్తినెదిరించుట ఈశ్వరసంకల్పమునే యెదిరించుట, పూర్వమందే జరిగిపోయిన ఒకతీర్పును కాదనుట! 'నిహతాః పూర్వమేవ' కౌరవజగత్తులో వారందరును నిజముగనే వధింపబడియున్నారు.

ఇప్పుడు మానవజాతియంతయు మనస్సు అను మెట్టుపైకివచ్చినది. ఈ యింద్రియమును మానవులందరును లెస్సగా నుపయోగింప నేర్చినారు. అసలు యోచనాశక్తియొక్క నిజస్థానమగు బుద్ధీంద్రియము ఈ మనస్సునకు పైమెట్టునకున్నది. మనుజులలో నే కొలదిమంది యందో యిది వికసించినది. అట్టి వారి యందును తిరిగి యేకొలదిమందియో దీనిని పక్వస్థితికి తేగలిగిరి. ఏగొప్ప ఆలోచనాపరులో, యదియును వారట్లాలోచనా నిమగ్నులగు తరుణములందే, దీనిని సక్రమముగ నుపయోగింప గలుగుచున్నారు తక్కిన వేళలలో వారును పడిపోదురు. ఆరితేరిన యోగులు మాత్రమే విశుద్ధబుద్ధిని కలిగియుందురు జనసామాన్యమునకు ఆలోచన నిర్మలముగనుండదు వారిబుద్ధి మనస్సుతోడను, మనస్సు చిత్తవృత్తులతోడను, చిత్తవృత్తులు ప్రాణకాంక్షలతోడను సంకరము చెంది యుండును. నిరంకుశమగు జ్ఞానప్రతిభ యింకను లేదు. ఇక యిందరియును వ్యక్తముగుట.

ఆత్మ యనునదింకను పైననున్నది. క్రిందిమెట్లలోనున్న యీ క్రియా కలాపమున కంతకును నదియే మూలకందము. అది యింకను వ్యక్తముకాలేదు. కాని మేధావికాసమును, భావనావ్యగ్రతయు, చిత్తవృత్తుల యుద్రేకతనుచూచి యొక్కొప్పుడవి యాత్మ లక్షణములని పొరబడుచుందురు. అది వీనికన్నింటికిని పైమెట్టుననున్న యుత్తమోత్తమస్థానము. ఇవి యన్నియు దానిని మరుగుపరచు పొరలును, తెరలును నైయున్నవి. ఆధ్యాత్మికత కొన్నివేళల మానవజాతిలోని కవతరించినది కాని యది తాత్కా-

లికము. వెంటనే తిరోహితమైనది. ఏకొందరు మహాత్ములయందో దాని యంశ శేషించి వారు మత కర్తలైరి.

## శాస్త్రములు—కళలు.

ఇప్పటికి మానవజాతికి వశమైనది ఊహాక్రియ మాత్రమే. ఊహవల్లనే మనుష్యుడు ప్రాచీనసంఘ నిర్మాణమును పడగొట్టి నూతనమైనదానికి పునాదులు కట్టుచున్నాడు. ఊహాశక్తికి సవ్యదక్షిణ హస్తములు కలవు. ఒకటి హేతువాదన. రెండు భావనాశక్తి. ఈరెండును లేనియెడల దానికి పరిపూర్ణత లేదు. విజ్ఞానశాస్త్ర తత్త్వశాస్త్రాదికముల పఠనమువలన హేతువాదన మభివృద్ధినొందును. అందుచే నాయా శాస్త్రముల ప్రయోజనమును మానవులు లెస్సగా గుర్తించిరి. రెండవదియగు భావనాశక్తికి చిత్రకళ కవిత్వము మున్నగునవి దోహదములు. దాని భావనాశక్తియొక్క ఫలితము లింద్రియగోచరములు కాకపోవుటచేత దానిని పెంపొందించు విషయముల ప్రయోజనమును జను లెరుగజాలకున్నారు. ఆలోచన కల్పన యనునవి సత్యమును కనుగొనగాలు కేంద్రములు. హేతువాదనము, విమర్శనము మున్నగునవి సత్యమును భూతమైన పిదప దాని యాథార్థ్యమును నిర్ధారణ చేయును, నేటి విద్యావిధానములో భావనాశక్తిని పెంపొందింపజేయునది ఒక్క పరిశీలనము. కేవల విజ్ఞానశాస్త్రజ్ఞునిదృష్టి సంకుచితము. సీమాబద్ధము. ఒకే గాడియందది తీక్ష్ణతను పొందునుగాని మానవ విజ్ఞాన వైశాల్యమునకుగాని శాస్త్రావరణ వైశాల్యమునకుగాని అతిసహాయకారి కాదు. అతనిదృష్టి ప్రకృతి పరీక్షయందారితేరినను అతని యంతరాత్మ వికసింపక సీమాబద్ధమై చెరపడి యుండునని టెన్నిసన్ వర్ణించుచున్నాడు. ఆత్మవికాసము నొసగని శాస్త్రదృష్టి నైపుణ్యము ఉత్తమ మానవత్వమునకు లక్షణము కాదు. ఆత్మవికాసమే సరళమును, విరళమును నగు విద్యవలని ప్రయోజనము. దానికొరకు భాష, సారస్వతము, తత్త్వశాస్త్రము, లలితకళలు మున్నగునవి మానవు డభ్యసింపవలయును. మిగిలినవానిసంగతి గుర్తించిరి కాని చిత్రకళా కవిత్వముల ప్రయోజనమును మనుష్యులు గుర్తించలేదు. అవి కేవల మలంకారప్రాయములనియు నందరకును వాని యవసరము లేదనియు చెప్పజూచుచున్నారు. కాని ఒకప్పుడు పశుప్రాయుడుగనున్న మనుష్యుని నేడు బుద్ధిప్రధానునిగ చేసినదేది? వానియందు కలిగిన సౌందర్యపిపాసయే దీనికి కారణము. అన్ని విషయము లందును నందముగ నుండవలయుననియే యతడు కోరుచున్నాడు. ఈ సౌందర్య కాంక్షయే వాని వృత్తిప్రవృత్తులను చక్కబరచుచున్నది. అతని హృదయకాంక్షలు మనోభావనలు దానివలన పరిశుద్ధిగావింపబడి యాతడున్నతస్థానమును పొందుచున్నాడు. ఈవిధముగ నేది యాతని వికాసమునకు బాసటయైనదో దానిని జాగ్రతగ కాపాడుకొనవలెను. లేనిచో మానవుడు తానుపొందిన యౌన్నత్యమును వీడి పడిపోవును. పంచభూతములను వశపరచుకొని బ్రహ్మాండమును తనకు పాదపీఠముగ జేసికొని శాస్త్రజ్ఞానమున నుద్దండుడైనను ఆత్మవికాసము నొందడేని యట్టివా డధమ జాతికి జెందిన యసురుడగుచున్నాడు. ఆసురీశక్తుల నాతడు పశువాంఛా పరిపూర్తికే వినియోగించును.

## శిల్పము

శిల్పమువలన మూడు ప్రయోజనములు కలవు (౧) సౌందర్యతృష్ణను కలిగించుట (౨) బుద్ధిని వికసింపజేయుట (3) ఆత్మోపలబ్ధిని చేకూర్చుట. వీనిలో

# కళ - దాని ప్రాముఖ్యత

మొదటిది లేకున్నచో మానవుడు తన మొదటియనాగరకస్థితిని దాటియుండకపోవును. మన వేదాంతశాస్త్రము ప్రకారము ఆనందమునుండియే జగత్తు పుట్టుచున్నది. ఆనందమునందే తిరిగి కరిగి పోవుచున్నది. అది భగవానుని యానందము. ఆ యానందమునందు సంతోషము, ప్రేమ, సౌందర్యము నిమిడియున్నవి. కనుక సృష్టియందున్న ఆదివ్య సౌందర్యమును మనము చూచి, చూచినదానిని ప్రేమించి, ఆ ప్రేమమూలమున నానందము పొందవలయును. అట్లు సౌందర్యమును మనము చూడగలుగునట్లు చేయునది శిల్పము. కావున శిల్పము సౌందర్యముద్వారా మన వృత్తిప్రవృత్తులను శుద్ధిగావించి యున్నతస్థానమునకు మనలను గొంపోవును. సృష్టిలోగల విభిన్న వస్తువులందలి సౌందర్య స్వభావములలో నితరతమ భావములను గుర్తెరిగి క్రమముగ పైకిపోవలయును. అందము అందవికారమున్నగు ద్వంద్వభావముల కతీతమగు అఖండ సానుభూతిని పొందవలయును.

మనుష్యుడు నాగరకుడగుటకు వానియందలి సౌందర్యతృష్ణయే సాధనభూతమగుచున్నది. సంస్కారులగు యూరోపియనుల యొక్కయు, ఆచారమర్యాదలు కల హిందువుల యొక్కయు, విపులకర్మకాండతో కూడిన కన్ఫ్యూషియను యొక్కయు నాకర్షణీయమగు జీవితవిధానములందు సౌందర్యతృష్ణయే వ్యక్తమగును. ఇది గాఢమైనకొలదియు బాహ్యాకార విధానములనే ప్రధానములుగ నెంచు దోషమునకు గురియై యంతశ్శుద్ధిని కోల్పోవును. ముందు ముందు బాహ్యాకారములను వెనుకకుబెట్టి తక్కువస్థానమునే యీయవలయును. సంఘాచారములను శాసనబంధనములనుదాటి మానవదృష్టి ఉత్తమ సౌందర్యమును కాంక్షించుచు స్వైరవిహార కావలయును. అదియే క్రిందివానిని పరిశుద్ధియొనర్చును. మానవజీవితముకూడ ఒక కళయే. వాక్కులో, వైఖరిలో, వర్తనలో చక్కదనమలవరచునది కళాదృష్టియే. అన్నిటికంటెను మానవునకు నాగరికత గలిగించుటలో మిక్కిలి శక్తివంతములైనవి ప్రేమ-భావన. నీతిశాస్త్ర నిర్మాణమునకును సౌందర్యపిపాసయే కారణము. పుణ్యము అందమైనది. పాపము అందవికారమైనది. దారుణములగు హింసాక్రియలనిన మనకు ఏవగింపుకలుగును. అమితమగు నింద్రియలోలత్వము అందవికారమైనది. అందుచేత నది పాపము. బ్రహ్మచర్య కన్యాత్వములందు సౌందర్యమును, స్వచ్ఛతయుగలవు. ఇవి పూర్వము గ్రీకుల నెక్కుడుగ నాకర్షించినవి. వారి నీతి శాస్త్రమంతయు సౌందర్య వికాసమునకే తోడ్పడు విధమున నిర్మింపబడినది. దానియందు నాలుగు దశలు నిరూపింపబడినవి (౧) కేవలము బాహ్యసౌందర్యము. (౨) శాసనముల ననువర్తించునది (౩) పైరెండింటి మిశ్రమము (౪) కేవల సౌందర్యము. అరిస్టాటిల్ సౌందర్య ప్రమాణమును బట్టియే నీతిని నిర్మించెను. సౌందర్యమే వారికి పరమావధియైనది. కాని మన దృష్టిలోనది యసమగ్రము. ఈశ్వరుడు సౌందర్యమయుడనుటలో ఒక్క సౌందర్యము మాత్రమే కాదు. బృందావన విహారియగు శ్రీకృష్ణుడు, ఆ శ్యామసుందరుడు - ఒక్క సుందరుడుమాత్రమే కాడు- అతడు ప్రేమమయుడు. ప్రేమపక్వము కానిచో సౌందర్యము పక్వము కాదు. సౌందర్యము పక్వము కానియెడల ఆనందము సత్యము కాదు. నీతిదృష్టిలోని సౌందర్యము పరిమిత ప్రవృత్తిని కలిగియుండును. మనము దానిని దాటి పైకిపోవలయును. కావుననే గ్రీకుల సౌందర్యాదర్శముపై తిరుగుబాటు కలిగి చివరకు అం

దమును కాంక్షించుటయే పాపమను పరమ పారిశుద్ధ్య వాదము ప్రబలినది. ఇది వైరాగ్యములలో తలయెత్తినది. మనయందును సన్యాసము పుణ్యములలో చేరి సౌందర్యమును పాపపుంజములలోనికి పారద్రోలినది. నిజమే. అందముకొరకు మంచిని విడువరాదు. కాని అమంచియనునది మాత్ర మందమైనదై యానందదాయకమై యుండవలయును. ఎంతవరకది యట్లు కాదో అంతవరకును నది మంచియయు కానేరదు. పుణ్యము పుణ్యముకొరకు నభ్యసించుట కాదు. మనకు కావలసినది ఆనందవికాసము! ఆ యానందము, ఆవికాసము, సౌందర్యమును ద్రోసి రాజుటలో లేవు.

చిత్రకళ సౌందర్యము ద్వారా మనల నుద్ధరించును. అది జీవితమునొక కళగా చేయును. ఆవేశజనకములగు జీవితఘట్టములలో మనము ఆనందమును చిత్తవృత్తులద్వారా అనుభవించుచున్నాము. అప్పుడు జీవితమొక కవితారచన యగుచున్నది. చిత్రకళ జీవితమును నిర్మలముగ నొనర్చుచున్నది. కవిత్వ మంతకంటెను శక్తివంతమైనది. మన రాగానుభవము అధోముఖముగ గాని ఊర్ధ్వముఖముగ గాని పనిచేయును. అధోముఖమగునేని యింద్రియలోలుర మగుదుము. ఊర్ధ్వగామియయ్యెనేని బుద్ధివికాసము నొంది జగదానందమునకు మూలకందమగు ఆత్మజ్ఞానమునే చేరుదుము. జీవితసృష్టి రసభరితము. హృదయమునందు స్వచ్ఛప్రవృత్తి కలదేని ఈశ్వరసృష్టియందలి రౌద్ర పరాక్రమావేశ సౌందర్యాదికములను గ్రహించి జీవితమునందలి కవితారసము ననుభోగించును. దానివలన చిత్తశుద్ధియు తన్మూలమున నౌన్నత్యసిద్ధియు ప్రాప్తించును. ఇట్టిది కవిత్వము, చిత్రకళయును వానివలన గలుగుచున్నప్పుడు వాని ప్రయోజనము అసందిగ్ధము. ఇవి యింతపనిని చేయుచున్నను మనుజులకవి యనావశ్యకములని జనులు వానిని త్రోసివేయజూచుచున్నారు.

జాతీయ వికాసమునకు కళ యమితముగ తోడ్పడును. సౌందర్యకాంక్షవలన జాతీయ జీవితమున గొప్ప మార్పు కలుగును. ఒకజాతిలోనున్న విజ్ఞానమును బట్టియు, నాచారమర్యాదలనుబట్టియు దానికి గౌరవము కలుగును. ప్రపంచమునందలి మానవజాతులలో పరాసుజాతి పొందుచున్న యభిమతికిని, యైరిషుజాతిపొందు ననురాగమునకు, ఉత్తమతరగతి యాంగ్లేయులుపొందు గౌరవమునకును సౌందర్యతృష్ణవలన వారువారుపొందిన సంస్కారమే కారణము. ఈ లక్షణము లేకుండుట జాతీయ దౌర్బల్యమునకు సూచన. సామాన్యుడగు నాంగ్లేయునిలో మోటు, మొరకుతనమును, ప్రష్యనునకు అతిమాత్రమగు స్వార్థకాంక్షయు గలవు. విజాతీయులతో వ్యవహరించునప్పుడే గుణములు వారి కడ్డుతగిలెను. యుగయుగములనుండియు ఆత్మగౌరవము, ఆచారము మర్యాద అనువాని కలవడినవారు భారతీయులు. అట్టిమనకే, దుర్లక్షణములు కల యాంగ్లేయులు, అధికారము వహింపబూనిన తరుణమున నెట్టి సంస్కారభావము కలిగినదో మనకు తెలియును. ఆంగ్లేయుని మోటుపద్ధతులే దీనికి కారణము. జర్మను దేశమునందలి దాక్షిణాత్యులును, ఆంగ్లేయులలో కెల్టులు, నార్మనులును లలితకళల నుపాసించిరి. వారిలోనుండి గొప్ప కళానిపుణు లుద్భవించిరి.

చిత్రకళకంటెను సంగీతము శక్తికలది. లయబద్ధమగు నాదములో మానవుడు తన్మయత్వము నొందును. గాయకుడు అని పిలువతగిన వాడాంగ్లేయజాతిలో పుట్టలేదు. విద్యాశిక్షణయందు సంగీతముయొక్క ప్రయోజన మసాధారణమైనదని ప్లేటో మహాశయుని

# కళ — దాని జాతీయ ప్రాముఖ్యత

యభిప్రాయము. జాతియందలి సంగీతాభివృద్ధి ననుసరించి ఆజాతియొక్క ప్రవర్తనా సౌందర్యమును అభివృద్ధిని గాంచును. వినను చిత్రకళయొక్కయు శిల్పకళయొక్కయు ప్రయోజనము మాత్రము సామాన్యముకాదు. మనచుట్టును నిరంతరము మనము చూచు అందచందములు మన మనస్సులలో హత్తిపోవును. ప్రకృతియందలి రేఖలలో, రూర్పులలో, రంగులలోగల యందమును బాల్యము నుండియు గ్రహింపజేసినయెడల నాతడు సౌందర్య శాసనమునను వర్తించును. మంచిదశలోనున్నప్పుడు మనవారును, పూర్వము గ్రీకులును, కొన్నియుగములలో యూరోపియనులును, జపానువారును దీని లాభమును పొందిరి. మనము యింటింటను చిత్రకళానిలయముల నెలకొల్పజాలము. కాని నిత్యజీవితమునందలి ప్రతి వస్తువును, ప్రతిపద్ధతిని సౌందర్యవంతములుగ చేసికొనగలము. దానివలన క్రమక్రమముగ మన చిత్తవృత్తులు, భావములు, గౌరవమాధుర్యములను పొందును.

కవితకుగల శక్తి చిత్రకళకులేదు. కవిత యొక్కవ కదలికగలది. చిత్రకళ స్థావరము. నిశ్చలము. దానికి నియతస్థలసంచారమే కాని స్వైరవిహారము లేదు. కవి చిత్తవృత్తుల నుద్బోధించి వానికి ప్రత్యేకానందమును సమకూర్చును. చిత్రకళ వానిని నిశ్చలముగ నొనర్చును. గ్రీకులు విశేషించి చిత్రకళోపాసకులు. చిత్రకళచే కవితను నిరుద్ధము చేయబూనిరి. సంగీతము చిత్తవృత్తులను గభీరములుగ నొనర్చి వానికి పరస్పర సామరస్యము గలిగించును. ఈ మూడు లలితకళలును మనుష్యుని ఆత్మోన్నతికి సాధనమగు నుత్తమశిక్షణము నొసగగలవు. కావున కేవల మింద్రియబద్ధమై, సాంఘిక ప్రవర్తనము వికలమై విశీర్ణమగుచున్న మానవజాతులు ఈ కళలను నిర్లక్ష్యముజేయుట శ్రేయోదాయకముకాదు. సక్రమముగ నుపాసించినచో అవియే మనకు జ్ఞానమును, గౌరవమును, నాగరకతను ప్రసాదించు శక్తులు. శాస్త్రము, వస్తువులను విడగొట్టి పరిశీలించి వస్తుతత్వమును గ్రహించునట్లుగ చేయును. కళ అట్లుకాదు. ఇతరుల మనోభావములతో తాదాత్మ్యమును కలిగించి సత్యము గ్రహింపచేయును. సానుభూతితో కూడిన సూక్ష్మదృష్టి కళాభ్యాసమువలన కలుగును. కళ సూక్ష్మమును, సుకుమారమునై యుండుటచే కళాభ్యాసకుని మనస్సును నట్టిదగును. బుద్ధివిశాలమై, సూక్ష్మమై, శాస్త్రోపకరణములు గ్రహింపజాలని, అంతరప్రకృతి రహస్యముల, తలుపులను తెరచి కళవలన మనము గ్రహింపగలుగుదుము. ఇట్టిశక్తిని కలిగించు సంగీత, చిత్రకళా, కవిత్వములకు మిగిలినవానివలె విద్యావిధానమున ప్రధానస్థానము నొసగకపోవుట విచారకరము. మనోవాహినికి విశాఖానదులవంటివియు, నలంకారములవంటివియు కాని యవసరములు కావనియే పెక్కండ్రమతము. మానవప్రకృతికవి విరుద్ధము. సంగీతముచే నాకృష్టుడగుటయు, రంగులనడుము, బొమ్మలమధ్యను నివసింపగోరుటయు మనుజులకు సహజములైయున్నవి. సహజముగనున్న యిట్టి వాంఛలకు సరియగు శిక్షణయు సంస్కారమును లేకున్న వానిని దుర్వినియోగముచేసి మానవుడు తుచ్ఛభోగములుమరగి భ్రష్టుడగును.

జాతీయాధ్యాత్మిక వికాసమునకును కళ సహాయకారి. కళవలనగలుగు నుపయోగములలో నిదియే శ్రేష్ఠతమమైనది. మతవికాసమునకును కళౌన్నత్యమునకు సన్నిహిత సంబంధముకలదు. ఇటలీ గ్రీసుదేశము లందిది కానవగును. మనమతమునందును సత్యోత్తము

మగు కళావికసనము మతభావ నిరూపణకు సాధన ముగ గ్రహింపబడినది. ఐనను మతము యొక్క బాహ్యాచార కాండకును కళకును నెట్టి సంబంధ మునులేదు. మానవుని ఆధ్యాత్మికాశయము లన్నియు మతమునందు కేంద్రీకృతములగుటచే కళకును మత మునకును సంబంధము కలిసినది ఆచారకాండకంటె ఆధ్యాత్మికత విశాలమైనది. దానిని సేవించుటలో కళ తన యుత్కృష్టవికాసమును పొందుచున్నది. దివ్యప్రేమ, దివ్యజ్ఞానము, దివ్యశక్తియను మూటిని మానవుడు పొందగోరుచున్నాడు. ఈ మూడును ఆధ్యాత్మికత యను పదమున నిమిడియున్నవి.

ఉత్తమమైన పాశ్చాత్య చిత్రకళవలె నేది బాహ్య స్వరూపమును సౌందర్య మయముగావించి, చిత్ర కళా శాసనముల ననువర్తించి, మానవజాతియొక్క చిత్తవృత్తులను పరితృప్తినొందించి, జీవితమును, బాహ్య సత్యములను ప్రతిబింబింపజేసి తుదకు వీని నన్నిటినిదాటి పైకిపోయి వస్తువులలో పైపైన కన బడుదానినే కాక లోతుననున్న ఆధ్యాత్మిక సత్య మును, ఈశ్వరుడు జగత్తులోపొందు ఆనందమును, దాని యందమును, రక్తిని, నిత్యపరివర్తనాత్మక మగు సృష్టిని వెలారించు నీశ్వరుని దివ్యసామర్థ్య మును, ప్రకటింపజాలునో అదియే యుత్తమమును పరిపక్వమునగు శిల్పము. భారతీయ చిత్రకళదీనినే పరిపూర్ణముగ సాధించినది. ఆప్రయత్నములో బుద్ధి పూర్వకముగ గాని, తొందరలోగాని బాహ్యాకార సౌందర్యము మున్నగు నప్రధాన విషయములనది పాటించినదికాదు. పాశ్చాత్యులు వానినే యధిక ముగ వాంఛింతురు. కాని చిత్రకళ తన మహోన్న తత్వమును పొందవలయుననిన భారతీయవైఖరియే ప్రాబల్యము వహించవలెను. శరీరమునకు హృదయ మునకు మనస్సునకు నీశ్వరస్పర్శను కలిగించినప్పుడే జీవుడు దేవుడగుచున్నాడు. బాహ్యస్వరూప విధా నములచే కళ బంధింపబడదు. శాశ్వతమగు సత్యము నది ప్రకటింపజూచును. కొన్ని రేఖలను కలిపి, కొన్నిరంగులనుపూని మానవుడు అనిర్వాచ్యమును నతీతమునగు గభీరసత్యమును సమగ్రముగ ప్రకటింప గలుగుచున్నాడు. ప్రకృతి యెట్టిదియో, నరుడెట్టి వాడో, నారాయణు డెట్టివాడో, కళానిపుణుడు ఒక తెరపైనగాని ఒక రాతిపైగాని యదార్థముగ చిత్రించును. ఏయీశ్వర చైతన్యము సృష్టిలో నిన్ని రీతులుగా ప్రకటితమగుచున్నదో దాని స్వరూప మును ధ్యానముచే సాక్షాత్కరింపజేసికొని యాత డద్దానిని వ్యంగ్యప్రధానముగ చిత్రింపగలుగును. ఊహాతీతమగు సత్యములన్నియు రూపము ధరించి కళలో మనకు ప్రత్యక్షమగును. యూరపియనులు వాంఛించెడు బాహ్యసౌందర్యము మున్నగునవియు నంత నిర్లక్ష్యము చేయవలసినవికావు.

జాతీయ దృక్పథములు విభిన్నములగుటచే యూరపునందును, భారతదేశము నందునుగల చిత్ర కళా ప్రవాహములు వేరువేరు మార్గముల దూర దూరముగ ప్రవహించినవి. చివరకీనాడు పాశ్చా త్యులు తమ మార్గములు సంస్కరించుకొని భారతీయ కళావిధానము నిప్పుడు ప్రశంసింప నారంభించిరి. ఆసియాఖండపు భావి వికాసమీనదీనదముల రెంటిని యొక యఖండ గంభీర ప్రవాహముగ నేకముజేసి తన్మూలమున మానవజాతి వ్యక్తముచేసికొను కళా పరిణామమును పక్వస్థితికి దేగలదు.

కొన్ని బొమ్మలలో, కొన్ని చెట్లచాటున, కొన్ని కొండలమరుగున, భగవానుని జ్ఞానము, భావన చిద్వి లాసము మిలమిలలాడుచు, రాగానుభూతి నందు

చున్నవి. సృష్టియందంతటను నీశ్వరప్రేమ తొలుకాడుచున్నది. అది స్వచ్ఛమును నిర్ద్వంద్వమునై యుండును. అందము, అందవికారము ననువాని నన్నింటి నది యుత్తమ భాగమునకు గొంపోవును. ఆ యమృతరసములో నొక బిందువైనను మానవ హృదయ ప్రాతికయందు చిందెనేని వాని జీవితమును, చర్యలును మారిపోవును. ఆ యమృతమంతయును వెల్లువయై ప్రవహించెనేని జాతి నంతను ఒక్కమారుగ పైకి తేలించి భగవానుని యొద్దకు జేర్చును.

అటులనే యీశ్వరుని శక్తి సామర్థ్యములు సృష్టియందలి యనంత లీలకాధారభూతము లగుచున్నవి. అలస విలసనముగల గులాబిపువ్వుయొక్క సుకుమార జీవితము మొదలు తారా తపన మండలముల జ్వాలా పరిభ్రమణములవరకును గల క్రియాకలాపముల కది చేయూత నొసగుచున్నది. మానవునియందును, విశ్వమునందును విభాసిల్లు నీశ్వరుని యజేయ శక్తి సామర్థ్యములను, ఆవేశోత్సాహములను మానవుని యందు నిరూపించుచు కళ యాతనిని ఈశ్వర ప్రతిబింబముగా మార్చును. కళవలని యుత్తమోత్తమ ప్రయోజన మిదియే.

మానవ వికాసమున కింతగా సహాయకారియగు కళా శిక్షణము నేజాతీయ నిర్లక్ష్యము సేయరాదు. కళాపోషక విషయములనుగూడ శాస్త్ర విషయములవలె విద్యా విషయములవలె విద్యా శిక్షణము నిర్బంధ విషయములుగ నొనరింప వలయును. ప్రతి మనుజుడును శిల్పి కానక్కరలేదు. కాని శిల్పదృష్టిని ప్రతి మనుజుడును కలిగి సౌందర్య సంస్కారము నొందవలయును. తన జీవితమున ప్రతి యంశమును సౌందర్యమయముగ జేయవలయును. వ్యక్తినుండి యట్టి సౌందర్య రచనను జాతి రాబట్టవలయును. నిరంతరము సౌందర్యోపాసినియగు జాతీయ సౌందర్య సిద్ధినొంది తిన్నాళమున తనయందలి ఆత్మ వికాసముయొక్క యుపలబ్ధి పొందును.

బంగాళాదేశమున నిప్పుడు నెలకొల్పబడిన జాతీయ విద్యాబోధనయందు దీవిషయమై యించుక ప్రారంభము కావింపబడినది. కాని సరియగు కళాదర్శము లేకపోవుటయు, ఆర్థిక దృష్టి కలిగి యుండుటయు దానికి దోహదకారులు కాకున్నవి. వాణిజ్యముకొరకు కాంగ్లేయులు తయారుచేయు ప్రతిమలను ఆదర్శములుగ గైకొని వారి పద్ధతుల ననుసరించుట వ్యర్థశ్రమ. మనుజులకును, వస్తువులకును నకలులను తయారుచేయుట శిల్పముకాదు. బాహ్య సౌందర్యమును, కొలతల ప్రకారము చిత్రించుట సులభ సాధ్యము. అది ఒక గొప్ప సామర్థ్యముకాదు. అసలు వస్తువు, దాని యాకార వర్ణములు భావనలో సృష్టి కావలెను. తదనురూపముగ స్వేచ్ఛగ చిత్రించు హస్తకౌశల మలవడవలయును. వస్తువుల యాంతర్యమునందున్న సంబంధ సత్యముల స్వరూపమును గ్రహించు దృష్టియు. వర్ణముల సామరస్యమును ప్రణాళికను కనిపెట్టగాలు శక్తియునలవడవలెను. ఆంగ్లేయ విధాన మీ విషయములో నిరుపయోగము.

భారతీయ సంప్రదాయానుసారిణియైన చిత్రకళా పునరుద్ధరణ మిప్పటికే స్థిరపడినది. ఈ సంప్రదాయమునకు చెందిన కళా నిపుణులు చిత్రించిన చిత్రములు ప్రఖ్యాత పాశ్చాత్య చిత్రములపై సవాలు చేయుచున్నవి. అయినను ఇంగ్లీషు పద్ధతు లింకను మనయందు నిలచియుంట క్షమింపవలసినది కాదు. ఈ విజాతీయాదర్శ సంపర్క దోషమును కడిగివేయ వలయును. జ్ఞానమునకు, సౌందర్య పిపాసకు పునాదులనువేయు విద్యా విధానమునందే యీ మార్పు ముఖ్యముగా జరుగవలెను. పూర్వ సంప్రదాయజ్ఞుల యంతర్దృష్టి, సహజ నైపుణ్యము, జాతీయాభిరుచి, భారతీయ హస్త కౌశలము, సత్యమును కనుగొనజాలు చూపు, యివి యన్నియు తిరిగి తలెత్తి, భారత దేశము తన పూర్వ విజ్ఞానముయొక్క ఔన్నత్య స్థానమునకేకాదు—యింకను పైకి పోవలయును.

# కృతజ్ఞత

శ్రీ మాలికా భూషణ

మస్తాన్‌తో నా స్నేహాన్ని కృష్ణాపురంలో అందరూ వింతగా చూసే వారంటే ఆశ్చర్యం లేదు.

కృష్ణాపురంలో కల్లు దుకాణంలో ఖాతా పెట్టుకుంటూ ఉంటే నాకు మస్తాన్‌తో పరిచయం కలిగి ఉండేది కాదు. నాకు మస్తాన స్నేహితుడు కావడానికి కూడా అవకాశం లేకపోను. చిన్న చిన్న సంఘటనలు జీవితంలో ఎంతటి పరిణామాలు కలుగ చేయగలవో చూస్తే ఆశ్చర్యంగా ఉంటుంది.

నేను ఆరోజుల్లో కృష్ణాపురంలో, బట్టల దుకాణంలో గుమాస్తాగా పని చేస్తూ ఉండేవాడిని. సంసార బాధ లేకపోవడంచేత హోటల్లో ఒక గది తీసుకుని అక్కడే భోజనం, కాఫీ, ఫలహారాలు చేస్తూ కాలక్షేపం చేసేవాడిని. ఆ హోటలు కెదురుగా ఉంది ఒక కల్లు దుకాణం.

బట్టల దుకాణం మూసివేసి, హోటలుకు వచ్చి భోజనంచేసి కల్లుదుకాణానికిపోయి, సిగరెట్టు తీసుకుని, తిరిగి గదికిపోవడం నాకలవాటు.

ఒకనాటిరాత్రి కల్లు దుకాణం దగ్గర నిలబడి ఉండగా ఒక నల్లటిమనిషి, గూడకట్టు, చిరిగిపోయిన పొట్టిచేతులచొక్కా, చింపిరిజుట్టు, ఎర్రటికళ్ళు, చేతిలోకర్రతో నన్ను పలకరించి "ఒకానీ ఇప్పించండి, బాబయ్యా, బీడీలు కొనుక్కుంటాన"ని అడిగాడు.

అతనివాలకం చూస్తే తాగిఉన్నాడని చెప్పడానికి సందేహము లేదు. కాని ఆమనిషినిచూస్తే నాకు జుగుప్స కలుగలేదు కాని జాలికలిగింది. 'అర్ధణా' బీడీలిప్పించాను. అతడు దణ్ణంపెట్టి వెళ్ళిపోయాడు.

ఒక నాడు హోటల్లో, మధ్యాహ్నం నిద్రపోయి, చీకటి పడుతూండగా లేచాను, నిద్రమత్తుఎక్కువగాఉంది. బద్ధకంగా లేచి, మొహం కడుక్కుని, కాఫీ గదికి తెప్పించుకుని తాగుతున్నాను. ఆనాటి రాత్రి బీడీలకు కానీ అడిగినవ్యక్తి అదేవాలకంతో గదిలో ప్రవేశించాడు. కొంచెం ఆశ్చర్యంగానే అతనికేసి చూసాను.

లోపలికి వస్తూనే అతడు "నాలుగణా లిప్పించండి బాబయ్యా, నా పెళ్ళానికి జబ్బుగా ఉంది. మందుతీసుకు రావాలండి, మీ కాళ్ళు పట్టుకుంటాను" అని క్రిందికివంగి దణ్ణంపెట్టబోయాడు.

అతనిని ఎప్పుడు చూచినా అదే భావం, అతడు తాగబోతున్న అనుమానం లేకపోలేదు. పెళ్ళాం పేరుచెప్పి నాలుగుడబ్బులు సేకరించి తాగేస్తాడేమోనని భయపడ్డాను. అయినా అతడడిగిన నాలుగణాలూ ఇచ్చి పంపించేసాను.

ఆ తరువాత అతని సంగతి తెలిసింది.

అతని పేరు మస్తాన్. మస్తాన్ ఆ ఊరి వాడే. మొదట్లో ఏదో కిళ్ళీదుకాణం ఉండేది. తాగుడు అభ్యాసం అయింది. కిళ్ళీదుకాణం తాగుడుక్రింద పోయింది. ఎప్పుడును కూలిపని చేసినవాడు కాదు. డబ్బులేక చాలా ఇబ్బందిపడుతూ ఉండేవాడు. వీటన్నిటికితోడు అతనిపెళ్ళానికి జబ్బుచేసింది. ఎవరో

# కృతజ్ఞత

పొందువంద లిస్తామంటే, ఆడబ్బుతీసుకుని ఖూనీచేసి ఎనిమిదేళ్లు జైల్లోగడిపాడు. బయటకు వచ్చిన తరువాత కూడా అతని జీవితవిధానంలో మార్పేమీ రాలేదు. అతని పెళ్లానికి జబ్బునయమూ కాలేదు. మస్తాన్ చెఱువు కాపలాపని సంపాదించి దానితో పొట్టపోసుకుంటున్నాడు.

మస్తాన్ క్రమంగా నాగదికి రాకపోకలు ప్రారంభించాడు. వచ్చినప్పుడల్లా అనాలుగణాలూ అడిగ తీసుకుపోతూనే ఉండేవాడు. మస్తాన్‌కి నేనెంత అడిగినా ఇస్తానని తెలిసిఉన్నప్పటికీ అంతకంటె అధికం అడిగేవాడుకాదు.

ఒకసారి ఒక చిన్న సంఘటన జరిగింది. ఆఊరికి ఒక సినిమా కంపెనీ ఏజంటువచ్చాడు. ఆయనకంపెనీ తాలూకు "హరిశ్చంద్ర" సినిమాను ఆఊళ్ళ ప్రదర్శిస్తున్నారు. ఆఏజంటు మాహోటల్లోనే బసచేశాడు. మాకిద్దరికీ పరిచయమైంది. అతను సినిమా చూడడానికి రమ్మని బలవంతపెట్టగా వెళ్ళడానికి అంగీకరించాను.

మొదటి ఆట "ఇంటర్వెల్" సమయంలో అతను భోజనానికి హోటలుకు వచ్చాడు. అతనే ఒకనాడు నన్ను తనకూడా సినిమాకు తీసుకొని పోయాడు.

మొదటి ఆటపూర్తయింది. మేమింకా హాల్లోనే కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాము. ఆసమయంలో ఆహాలు యజమాని లోపలకు వచ్చాడు. అతనికీ, ఏజంటుకూ ఎలాంటి సంబంధబాంధవ్యాలున్నాయో నాకు తెలియదుకాని, ఏజంటు ప్రక్కనే కూర్చున్న నన్నుచూసి "వెళ్లవయ్యా. బయటికి" అన్నాడు.

నామిత్రుడు "నేను ఉండమన్నానండి, ఆయన నాస్నేహితులు......"అని ఏదో చెప్పబోయాడు.

కాని దానికి అడ్డువచ్చి యజమాని" ఇది సినిమా. స్నేహాలూ, గీహాలూ ఇక్కడ పనిచెయ్యవు. వెడతావా, తన్ననా" అని అరిచాడు. నాకు కోపం వచ్చింది. ఇదేమిటో పూర్తిగా చూస్తేనేకాని కదలకూడదనుకున్నాను. ఆయజమాని చాలా దుర్మార్గుడని ప్రతీతి. ఏంజరుగుతుందోనని నామిత్రుడు భయపడుతున్నాడు.

నేనింకా అక్కడే ఉండడంచూసి, కోపాన్ని ఆపుకోలేక ఆహాలు యజమాని అరుస్తూ నామీదికి రావడం ప్రారంభించాడు. సరిగ్గా అదేసమయానికి మస్తాన్ హాల్లోకివచ్చాడు. ఇట్టేసంగతిగ్రహించాడు.

గుమ్మంలోంచే మస్తాన్ "ఏంయ్...కదలావంటే చంపేస్తాను. ఆగక్కడ" అని కేకవేశాడు. హాలు యజమాని మస్తాన్ కేకవిని నిలువునా నీరైపోయాడు.

తరువాతి విషయం చెప్పవలసిన పనిలేదు. ఆ ఊరిలో మస్తాన్‌కు భయపడనివారు లేరు. నేను వెంటనే తిరిగి హోటలుకు వచ్చేసాను. మస్తాన్‌కూడా వచ్చి నన్ను హోటల్ దగ్గర దిగబెట్టి వెళ్ళిపోయాడు.

సినిమాహాలు ప్రక్కగా నేఉంది మస్తాన్ కాపలా కాసే చెరువు. రాత్రిళ్ళు మధ్యమధ్య ఓసారిహాలుకు వచ్చి అక్కడ తిరుగుతూ ఉండడం మస్తాన్‌కు అలవాటు.

ఆతరువాత ఎన్నిసార్లో మస్తాన్ నన్ను ప్రతిమాలాడు. "బాబయ్యా, మీరు ఊం అనండి, మిమ్మల్ని మాటన్న ఆవెధవని పాడిచేస్తాను. వాణ్ణేంచేసినా పాపంలేద"ని చెప్పేవాడు. చివరకి నేను మాట్లాడనని బెదిరిస్తేకాని సినిమాహాలు యజమాని విషయాన్ని మస్తాన్ విడిచిపెట్టలేదు.

మస్తాన్ ఏవిధంగానైనా నాకు తన కృతజ్ఞత తెలుపుకొనడానికి మాత్రమే ఈవిధంగా ప్రయ

త్పించాడని నాకు తరువాత కాని అర్థమయింది కాదు.

పైసంఘటన జరిగిన కొంతకాలానికే మస్తాన్ భార్య పోయింది. ఆసమయంలో అన్నిటికీ నేనే మస్తాన్‌కు సహాయం చేశాను. మస్తాన్‌కు ఈవిశాల ప్రపంచంలో నేనొక్కణ్ణే అండగా లభించాను.

కృష్ణాపురాన్ని నేనింక విడిచిపెట్టవలసిన అవసరం కలిగింది. సంగతి మస్తాన్‌కు చెప్పాను. మస్తాన్ క్రుంగిపోయాడు.

ఒకనాటిరాత్రి తొమ్మిదిగంటలకు నేను దుకాణంనుంచి హోటలుకు తిరిగివచ్చాను. ఎన్నడూలేనిది మస్తాన్ గదిదగ్గర కనిపెట్టుకుని కూర్చునిఉన్నాడు. కారణమడిగాను, "నాతో రావాలి బాబయ్యా, మా ఇంటికి" అనిమాత్రం అన్నాడు. నాకు అర్థం కాలేదు. త్రాగిఉన్నాడేమోనన్న అనుమానం ఉంది, కాని మస్తాన్ మామూలుగా మాట్లాడుతూ ఉండడంవల్లా, మస్తాన్ నా కేరకమైన అపకారం తలపెట్టలేడని పూర్తి విశ్వాసం ఉండడంవల్లనూ నేను మస్తాన్ వెంట బయలుదేరాను.

మస్తాన్ ఇల్లు చెరువుగట్టు నానుకొని ఉంది. ఆ రాత్రి చీకటి ఎక్కువగా ఉంది.

మస్తాన్‌ది పెద్ద తాటాకులకొంప. చేరవేసిఉన్న తలుపునుత్రోసి మస్తాన్ లోపల ప్రవేశించాడు. లోపల కుడిచేతివేపు గదిఉంది. ఎడమవైపుని చిన్న హాలులా ఉంది. వంటసామానులూ, అవీ అక్కడే ఉన్నాయి.

ఆగదిలోకి తనకూడా రమ్మని మస్తాన్ ఆహ్వానించాడు. వెళ్ళాను. గదిలో చిన్న గుడ్డిదీపం మినుకు మినుకుమంటూ ఉంది. ఆగదిలో ఒకచిన్న నులకమంచంఉంది. మంచంమీద ఓ ఇరవైఏళ్ళ యువతి కూర్చునిఉంది. మమ్మల్ని చూడగానే ఆ అమ్మాయి లేచి నిలబడింది.

మస్తాన్ ఆ అమ్మాయినుద్దేశించి నన్ను చూపుతూ "ఈయనే నేను తీసుకువస్తానన్న మహారాజు, మర్యాద దక్కించాలిసుమా" అన్నాడు. ఆ అమ్మాయి చిరునవ్వునవ్వి, ఆహ్వానపూర్వకముగా నా కేసి సాభిప్రాయంగా చూసింది.

మస్తాన్ నా కేసితిరిగి "కృష్ణాపురంలోకల్లా మంచిపేరెక్కిన పిల్ల బాబూ, భోగంవాళ్ళల్లో ఇలాంటి సరసమైనది లేదంటారండి. మీకోసం ఏరికోరి సంపాదించాను" అని ఆనందంతో చెప్పాడు.

నేను వెంటనే తిరిగి హోటలుకు వచ్చేశాను.

మస్తాన్ తెల్లబోయాడు.

మస్తాన్ హృదయమంతా నాయెడల స్నేహభావంతో నిండివుంది. దాన్ని నాకు ప్రకటించడానికై తగిన సాధనానికి చుట్టూకలయ చూశాడు. మస్తాన్‌కు అవే కంటకాలు, శిలలు గోచరించాయి.

తన జీవితాన్ని అర్థంచేసుకొనలేని మస్తాన్ వాటినే హృదయపూర్వకంగా తనకృతజ్ఞత తెలుపుకొనడానికై వినియోగించాడు. కనుకనే సరళహృదయుడు. మస్తాన్ కృతజ్ఞతాభావం కళంకం కానేరదు.

# యాచకులు

శ్రీ దిగుమర్తి రామారావు

ఏకాంక నాటిక.

పాత్రలు :

౧. పంతులుగారు—ఉద్యోగి.
౨. అమ్మణ్ణి—పంతులుగారి కుమార్తె; ఎనిమిదేళ్ల బాలిక.
3. బుచ్చినాన్న—పంతులుగారి కుమారుడు ఆరేళ్ల బాలుడు.

కొందరు యాచకులు.

సమయము—ఉదయము.

(ఆఫీసు గదిలో టేబిలుదగ్గర ఏదో వ్రాసుకుంటూ, మధ్యమధ్యని టేబిలుపైనఉన్న రెండు పుస్తకాలను తీసిచూస్తూపనిలో నిమగ్నులైఉంటారు పంతులుగారు. బిళ్లగోచీ వేసుకొని పంచెకట్టు, పైమీద తువాలు, కళ్లకద్దాలు. చేతిలోఫౌంటెన్‌పెన్. పక్కని ఎఱ్ఱ పెన్సిలుతో- కొంచెము వయస్సుమళ్ళిన పంతులుగారు. ఇంట్లోనేఉన్నా, ఆఫీసు వాతావరణాన్నే స్ఫురింపచేస్తూఉంటారు. ఇంతలో అమ్మణ్ణి కాఫీగ్లాసుతో నెమ్మదిగా ప్రవేశించి బల్లమీదఉంచుతుంది)

పంతులుగారు గ్లాసు చప్పుడువిన్నా అటు చూడకుండానే : "మందు తీసుకు వచ్చావురా బుచ్చినాన్నా !"

అమ్మణ్ణి : మందుకాదు నాన్నగారూ, కాఫీ

పంతులుగారు అటుచూడకుండానే కాఫీగ్లాసు తీసుకుంటూ కాఫీ తీసుకొచ్చావుటే అమ్మణ్ణి!

అమ్మణ్ణి: నా పెన్సిలు విరిగిపోయింది. కొత్తది కావాలండి !

పంతులుగారు అటుచూడకుండానే .

అలాగేనులే. అమ్మని అడుగు. (టేబిలుమీదఉన్న పుస్తకాలనుండిదృష్టి అట్టే మళ్ళించకుండా గబగబ కాఫీపుచ్చుకుని అక్కడఉంచగా కాఫీగ్లాసు తీసుకొని అమ్మణ్ణి వెళ్ళిపోతుంది. పంతులుగారు పని చూచుకుంటూనే ఉంటారు. ఇంతలో బుచ్చినాన్న చిన్న పెండిగిన్నె పట్టుకుని ప్రవేశించి అందులోని పాలతోకలిపిన ఔషధం వొలిగిపోతుందేమోనని మెల్లగా నడుస్తూవచ్చి బల్లమీద పెడతాడు.)

పంతులుగారు అటు చూడకుండానే : కాఫీ చాలులే అమ్మణ్ణీ.

బుచ్చినాన్న : మందునాన్నా.

పంతులు: అటుచూడకుండానే 'మందు తెచ్చావురా బుచ్చినాన్నా' (ఔషధం పుచ్చుకొని మళ్ళీ పనిలో నిమగ్నులవుతారు పంతులుగారు)

రెండవ రంగము

(కొంచెం దూరంనుంచి "శ్రీరంగ రంగ రంగా, నాయన్న కావేటి రంగరంగా" నిన్నెట్లు విడిచుందురా, నాయన్న కస్తూరి రంగరంగా" అని పాట వినిపిస్తూఉంటుంది. ప్రేక్షకులకు ఎదురుగా ఒక సంపన్న కుటుంబీకుల గృహముయొక్క వీధిచావడి; వీధికీ చావడికీ మధ్యనున్న గృహావరణలో పూలమొక్కలు, వీధితలుపు తెరిచేఉంటుంది; గుమ్మానికి

పసుపు, యింటిముందు ముగ్గులు; కొద్దిరోజులక్రిందట కట్టిన మామిడాకుల తోరణము; చావడి తుడిచి శుభ్రముగా ఉంటుంది; చావడిమీద ప్రేక్షకులకు ఎడమవైపున మొదటిసీనులో చూచిన ఆఫీసు గది తాలూకు కిటికీ వీధివైపు తెరువబడివుంటుంది; కిటికీలోనుంచి ప్రేక్షకులకు మేజాబల్లా, పంతులుగారూ కనిపిస్తూఉంటారు. అమ్మణ్ణి యింటిలోనుంచి చావడిలోకివచ్చి గోడనానుకుని నిలబడి పాట వింటూ ఉంటుంది. వీధిచావడివేపున్న ఆఫీసుగది తలుపు చేరవేసి ఉండడాన్ని అమ్మణ్ణికి వాళ్ళ నాన్నగారు కనిపించరు. ఇంతలో తెల్లని నూదకట్టూ, పైమీదఉత్తరీయమూ, తలకి పట్టుపాగాధరించి - కుడిచేతిలో జోగాతో మి మోస్తూన్న పెద్ద రాగి అక్షయపాత్ర, ఎడమచేతిలో చిడతలతో పాటను హరిదాసు ప్రవేశించి యింటిముందు నిలబడి పైని వినిపించిన గీతమే పాడుతూ ఉంటాడు.

పాటాని హరిదాసు :

> పాములకురా అయినా
> శేషుండు వాసుకై పవళించగా
> పాపమేమి చేసినామో,
> నలినాక్షి, భయముని కేలనమ్మా"

అమ్మణ్ణి: (హరిదాసు నుద్దేశించి) "పాములికి రాజు ఎవరు?"

హరిదాసు : (నవ్వుతూ) "గోపాలకృష్ణుడు, చిట్టితల్లీ"

ఆఫీసు గదిలోనుంచి పంతులుగారు: "అమ్మా, అడిగి యిన్ని బియ్యం తీసుకువచ్చి వెయ్యవే"

అమ్మణ్ణి: "తెస్తున్నాను నాన్నగారూ" అని లోపలికివెళ్ళి త్వరలోనే దోసిలితో బియ్యంతీసుకుని వస్తుంది; వెనకాలే బుచ్చినాన్నకూడా బియ్యంతీసుకునివస్తాడు; ఒకరితరువాత ఒకరు వాళ్ళకందేలాగున కొంచెంవంగి పట్టుకున్న హరిదాసు అక్షయపాత్రలో బియ్యంవేస్తారు. "శ్రీ కృష్ణార్పితము"అని, వారి నాశీర్వదిస్తున్నట్టుగా సవినయముగా చిరునవ్వుతో హరిదాసు వెళ్ళిపోతాడు)

బుచ్చి:"హరిదాసు ఏమిటి చెప్పాడే అక్కా?"

అమ్మణ్ణి: గోపాలకృష్ణుడు పాములిక రాజట; అందుకని ఏమీచెయ్యవట"

బుచ్చి: "అమ్మ చెప్పిందే, ఆగోపాలకృష్ణుడే?"

అమ్మణ్ణి: "అవును ఆగోపాల కృష్ణుడే"

(నేపథ్యంలోనుంచి మళ్ళీ "ఎందుకైనా ఉంచినావో, బందిఖానలో, రామా" అని రామదాసు కీర్తన వినిపిస్తుంది) అమ్మణ్ణీ, బుచ్చినాన్నా పాట వింటూ, వీధివైపు చూస్తూ ఉంటారు. కొద్దిసేపటిలోనే– పొడుగుపంచె, పట్టెనామాలూ, చేతిలో చిడతలూధరించి రామదాసుపాట పాడుకుంటూ ప్రవేశిస్తాడొక రామదాసు భక్తుడు)

రామభక్తుడు :

> "రామా, రఘునందనరామా!
> రామా! భద్రాచలవాసా!
> రామా, నామొఱలినవయ్యా!
> ఎందుకైనా॥
>
> పన్నెండు ఏండ్లాయే,
> ఒడలీ, కాహారములేదూ,
> కండ్లా, నిద్రైనాలేదూ,

నల్లులా బాధాలచేతా, నలుగూచు
న్నాదీ దేహము

**బుచ్చినాన్న:** "నల్లులా, దోమలా?"

**రామదాసు** భక్తుడు (నవ్వి)

పారశీకా, హుమాయున్పైనా,
జోడూ తుపాకుల బారుతో,
వచ్చినారయా, తానిషవారూ,
రామా యిక భరింప లేనూ!
ఎందుకైనా

(ఆఫీసుగదిలోనుంచి పంతులుగారు కొంచెం చీదరతో "ఈ లెక్క తెగక ఏస్తూంటే ఈ నల్లులూ, తుపాకులూ గోల ఏమిటోయ్!"

**రామదాసు** భక్తుడు: (ఆఫీసుగది కిటికీవేపు తిరిగి వమ్రభావంతో) చిత్తం బాబయ్యా.

(పంతులుగారు గదిలోనుంచే) "అమ్మణ్ణీ, కాస్త బిచ్చంపెట్టి పంపించు"

అమ్మణ్ణీ, బుచ్చినాన్నా లోపలికి వెళ్ళి త్వరలోనే యిద్దరూ ఏసిళ్ళతో బియ్యం తీసుకుని వస్తారు; ఒకరితరువాత ఒకరు రామదాసు భక్తుని జోలెలో బియ్యం వేస్తారు. భక్తుడు "రామయ్య తండ్రీ, మీ కిడుపులు చల్లగా" అని నవ్వి వెళ్ళిపోతాడు.

**అమ్మణ్ణి** · నల్లులు ఎవరినో గట్టిగా కుట్టేవాయిట!

**బుచ్చి** : ఎవరిని?

**అమ్మణ్ణి** : ఏమో, తుపాకీతో అప్పుడు కొట్టేవారుట!

**బుచ్చి** : నల్లినా?

("హరేరామ, హరేరామ. యనుమా, ముందు క్షణమూ, నీది స్థిరమా" అని పాడుకుంటూ, కాషాయిబట్టలూ. తంబురాతో ప్రవేశిస్తాడొక యాచకుడు)

బుచ్చి: ఇది బొబ్బిలిపాటేనా?

అమ్మణ్ణి: కాను తమ్ముడూ, యిది వేషం.

బుచ్చి. ఏం వేషం అక్కా?

అమ్మణ్ణి. దేముడు వేషం

బుచ్చి: అవతారమా?

యాచకుడు నవ్వి, తిరిగి తంబురామీటుతూ ఆ ముక్కే పాడతాడు.

పంతులుగారు లోపలనుంచి చీదరతో: ఎవరా స్వరం మూలిసపాటూ! వేళా పాళా ఉండనక్కర లేదూ!

యాచకుడు: (ఆఫీసు కిటికీవేపు తిరిగి) చిత్తం, యాచకుణ్ణి బాబయ్యా! కాస్త బిచ్చం పెట్టించండి బాబూ!

పంతులుగారు: (లోపలనుంచే చీదరతో) అమ్మణ్ణ, యింత వేసి వెళ్ళమను!

అమ్మణ్ణి. బుచ్చినాన్న లోపలికి వెళ్ళి బియ్యం తెచ్చి వేస్తారు.

యాచకుడు: (నవ్వి) పిల్లల నద్దేశించి మా అమ్మ లక్ష్మి! మా చినబాబు ధర్మరాజు అంటూ వెళ్ళిపోయాడు. ఇంతలోనే,

"ఏమిజన్మము ఏమిజీవనమూ!
ఈమాయకాయము" అని పాడుతూ. చిరిగిన బనియను, చిన్న గావంచాలతో నడివయసులో ఉన్న ఒక బిచ్చగాడు ప్రవేశిస్తాడు. అమ్మణ్ణి, బుచ్చినాన్న మళ్ళీ శ్రద్ధగా వింటూంటారు. పంతులుగారు చిరాకు

కోపంతో తలుపు తెరచి వీధి చావడిలోకి వచ్చి "ఆవును ఏమిజన్మమురా! అయితే ఏమంటావు? రాయిలాగున్నావు; ఎక్కడేనా పనిచేసుకోకూడదూ?" అంటాడు.

బిచ్చగాడు : [దీనంగా]పని అందరికీ దొరకదు బాబూ!

పంతులుగారు : పనిలేకపోతే ఈ దిక్కుమాలిన పాటా నీకుదొరికింది! ఏదేనా శుభ్రమైనపాట నేర్చుకొని మరీరా!

బిచ్చగాడు : పాటలవపు ఊరికినే నేర్పుస్తారు బాబూ?

పంతులుగారు : అయితే పాటకూడా నన్నే నేర్పించమంటావుట్రా? నా లెఖంలా తగలడింది! ఛా! యింత బిచ్చంవేసి వేగంపొమ్మను అమ్మణ్ణీ!

పంతులుగారు తొందరగా గదిలోకి వెళ్ళిపోతారు; అమ్మణ్ణి లోపలికి వెళుతుంది.

బుచ్చి: మరి నీకు పాటలురావూ?

బిచ్చగాడు: (నవ్వి) ఏమా కొండలవాడా! వెంకాటారమణా, ఎడబాయుటా, నీకు తగునా

బుచ్చినాన్న : ఏడుకొండలా?

బిచ్చిగాడు. (నవ్వి) తిరుపతి వెంకవేశ్వర్లు

బుచ్చినాన్న : "నువ్వు తిరపతినుంచే వస్తున్నావా?"

బిచ్చగాడు నవ్వుతాడు; అమ్మణ్ణి చిన్న బుట్టతో బియ్యం తీసుకువస్తుంది; మొదట అమ్మణ్ణి. తరువాత బుచ్చినాన్న బియ్యం వేస్తారు. బిచ్చగాడు ఎవరికీ ప్రత్యేకంగా కాకుండా, గృహానికే నమస్కరించినట్టు కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించి వెళ్ళిపోతాడు.

బుచ్చి : తిరపతి దేముడు కొండమీదనే ఉంటాడుటే అక్కా?

అమ్మణ్ణి : అవును

బుచ్చినాన్న : ఎప్పుడూ దిగడూ?

అమ్మణ్ణి : పెళ్ళికి దిగుతాడు.

ఆకలేస్తూందమ్మగారూ! అంటూ గోచీగుడ్డతో తొమ్మిది, పదేళ్ళ పిల్లవాడు ప్రవేశిస్తాడు.

అమ్మణ్ణి : నీకు పాటలు రావూ

పిల్లవాడు : ఆకలేస్తూందమ్మా!

బుచ్చినాన్న : మీఅమ్మ అన్నం పెట్టలేదూ?

పిల్ల: అమ్మలేదు. ఆకలేస్తూందమ్మగారూ!

పంతులుగారు లోపలనుంచి చీదరతో : "మళ్లీ తయారయ్యారూ! ఆదివారం మనని యింట్లో నిలవనీయనట్టుంది! అమ్మణ్ణీ. ఆబియ్యంబుట్టఅవతలపెట్టి ఆవచ్చే ప్రతీ గాడిదనీ అల్లరిచెయ్యక యింతింత తీసుకునిపొమ్మను!

బుచ్చినాన్న: (బియ్యపుబుట్ట పిల్లవానికి చూపిస్తూ) తీసుకో

పిల్లవాడు : (తీసుకోకుండా) ఆకలివేస్తూందమ్మా!

బుచ్చి : నాన్నా. ఆకలేస్తూందిట; బియ్యం తీసుకోవడంలేదు.

పంతులుగారు కోపంతో ఎఱ్ఱపెన్సిలు చేతితో పట్టుకుని పైకివస్తారు. పిల్లవాడు భయపడి వెళ్లిపో

తాడు. పంతులుగారు శాంతించి: సరే! రమ్మను. అమ్మతో చెప్పి వంటయితే యింత అన్నం పెట్టమనవే అమ్మణ్ణీ!

అమ్మణి లోపలికి వెళుతుంది : పంతులుగారు గదిలోకి వెళ్తాడు. బుచ్చినాన్న పిల్లవాడిని గమ్మని పిలుస్తాడు; అమ్మణి యింతలో లోపలనుంచి రెండు మామిడిపళ్లు తెచ్చి, పిల్లవానితో "నైవేద్యంఅవగానే అమ్మ అన్నం పెడుతుంది; అందాకా ఈమామిడిపళ్లు తింటూఉండు."

పిల్లవాడు మామిపళ్లందుకుని ఒకపక్కకు వెళ్లి తిందూ ఉంటాడు.

అమ్మణ్ణి : (ఆఫీసుగది వేపు తిరిగి) "నాన్నగారూ! వంటయిందట. అమ్మ నీళ్ళు పోసుకోమంది."

(పంతులుగారు లోపలనుంచి)ఆలాగే అమ్మణ్ణీ!

పంతులుగారు వీధి చావడిలోకి రాకుండానే ఆఫీసుగదిలోనుంచి యింటిలోపలికి స్నానానికి వెళ్తారు.'

బుచ్చి : అక్కా, ఇంకెవరూ బియ్యంఅడగడానికిరారూ?

అమ్మణ్ణి : అంతా అయిపోయినట్టున్నారు.

బుచ్చి : బుట్టలో యింకా బియ్యం మిగిలిపోయాయి !

ఇంతలో దృష్టిబాగాఆనని వృద్ధుకొకడు మెడలో తులసిమాలతో "హరి హరి హరికృష్ణ! హరి, హరి, హరిబోల్''' అంటూ ఉత్కళదేశపు వైష్ణవగీతం తాళాలతో వాయిస్తూ, పాడుతూ ప్రవేశిస్తాడు.

బుచ్చినాన్న : ఇంకెవరూలేరు; అంతా తీసుకో.

వృద్ధుడునవ్వి మళ్లీతాళాలు వాయిస్తూ పాడతాడు.

అమ్మణ్ణి : (బియ్యం బుట్ట తీసి) ఇంకెవరూ లేకపోతే తీసుకో.

వృద్ధుడు నవ్వి జోలెపడతాడు. అమ్మణ్ణి బుట్టలో మిగిలిన బియ్యం వేస్తుంది. వృద్ధుడు "జగన్నాథే" అంటాడు.

బుచ్చినాన్న : మళ్లీ తాళాలు వాయించు

వృద్ధుడు : [నవ్వి]

"ఆసో ఆసో గోపోవోళీ.

క్రిష్ణేజీబే, ఫుల్లోతోళీ"

"గోపికలా, రారండీ.

కృష్ణుడుపూలకు, వెడలుచునుండె."

అని తాళాలు వాయిస్తూ పాడుతూ ఉంటాడు. అమ్మణ్ణి. బుచ్చినాన్నకూడా ముగ్గురయి పాడుతూ ఉంటారు. పంతుగారు పట్టుపంచీ, పైమీద అంగవస్త్రముా వేసుకొని లోపలినుంచి వచ్చి ఆ దృశ్యం చూచి ఆశ్చర్యంతో అలాగేనిలబడిపోతారు. అమ్మణ్ణి బుచ్చినాన్న పాడుతూనే ఉంటారు. వృద్ధుడు తన్మయంతో కళ్లుమూసుకుని తాళం వేస్తూ ఉంటాడు.

[తెరపడును.]

# కృష్ణలాల్ భట్

శ్రీ జయంతి పరేఖ్

రూప సౌందర్యారాధకులకు శక్తివంతులైన మూర్తి చిత్రకారులను, అన్వేషించడము. వారిని వాపరణతో గమనిస్తూ ఉండడము మహదానందకరమైన విషయాలు.

శ్రీకృష్ణలాల్ భట్ ౧౯౦౫ లో ఒక కచ్ఛవారు గ్రామంలో జన్మించాడు. వీరి వైష్ణవ సంప్రదాయానికి చెందిన బ్రాహ్మణ కుటుంబము. ఆయన స్వభావంలో కూడా ఆ సంప్రదాయముద్రలు స్పష్టంగా కనిపిస్తూ ఉంటాయి. ఆయన తండ్రి అహమ్మదాబాదులో ఒక మిల్లులో కాతాదారు మానుడుగా ఉండేవాడు. ఆయన పినతండ్రి ఒక దేవాలయములో అర్చకుడుగా ఉండేవాడు. తన భక్తి పారవశ్యమువల్ల అనేకతాను గ్రహాలు సంపాదించుకొన్న గొప్పవాడని గట్టిగా చెప్పుతారు. కృష్ణలాల్ సోదరులలో ఒక ఆయన శ్రీ నందలాల్ బోసువద్ద చిత్రకళ అభ్యసించాడు. కాని అతడు చిన్నతనంలోనే మరణించాడు. మరి ఒక సోదరుడు అహమ్మదాబాదులో ఛాయాచిత్రగ్రాహకుడుగా ఉంటూ బాగా పేరు సంపాదించాడు.

కృష్ణలాల్ స్కూలులో చదువుకునే రోజులలోనే చాలా చిన్నతనం నించీ బొమ్మలు గీయడం నేర్చుకున్నాడు. అంతేకాక చాలా చిన్నప్పటినించీ వైష్ణవ దేవాలయాలలో ఉండే చిత్రాలంకారాలు అతిశ్రద్ధగా గమనించేవాడు. పైగా వైష్ణవ గృహాలలో కనిపించే ముగ్గులు, చెక్కడపుపనులు, మొదలైనవి కూడా అతన్ని ఎంతో ఆకర్షించాయి, అతను స్కూలులో ఉన్నప్పుడే అహమ్మదాబాదులో ఉండే తాలింఖానాలో ప్రవేశించాడు. ఈ తాలింఖానాలు పురాతన సాధనలు స్థాపించాయి. ఇవి గుజరాతులో పెద్దపెద్ద నగరాలలో ఉండే యువకుల నందరిని ఆకర్షించాయి. యువకులను సుశిక్షితులనుగా చేసి వ్యాయామములోను, కళలలోను ఆసక్తి కలిగించడమే వీటి ఆదర్శము. శ్రీ ఎ. కె. పురాణీ మొట్టమొదట ఈ సంఘాలలో ఉన్న చిత్రకారుని గ్రహించి అతనికి రవిశంకర రావళ్‌తో పరిచయం కలిగించాడు. రవిశంకర రావళ్ అప్పటికప్పుడే గుజరాతులో సుప్రసిద్ధ చిత్రకారుడని పేరుపొందిన యువక చిత్రకారుల కొందరికి ప్రోత్సాహం ఇస్తూ ఉండేవాడు. కృష్ణలాల్ గుజరాత్ కాలేజీలో విద్యాభ్యాసము చేసేటప్పుడే రావళ్ వద్ద చిత్రకళ అభ్యసించేవాడు. కాని కళాశాలలో చదివే ఆఖరు సంవత్సరంలో చదువు, చిత్రకళ రెండూ సాగించలేక చిత్రకళాభ్యాసంకోసం కళాశాల చదువు విడిచిపెట్టాడు. ౧౯౨౩ లో ఇతను బరోడా కళాభవనములో ప్రవేశించి ప్రమోదకుమార చటర్జీవద్ద ౧౮ నెలలపాటు కళాభ్యాసం కొనసాగించాడు.

ప్రమోదకుమార చటర్జీ కళాభవనం విడిచిపెట్టినప్పుడు కృష్ణలాల్ కూడా అక్కడనుంచి వచ్చివేశాడు

కృష్ణలాల్ భట్ చిత్రాలు





కృష్ణలాల్ భట్ చిత్రాలు





# కృష్ణలాల్ భట్

కొన్ని అననుకూల పరిస్థితులవల్ల మళ్ళీ కొంతకాలం దాకా అతను చిత్రకళ అభ్యసించలేను. ఆతరవాత అతను ౧౯౨౭ లో వివాహం చేసుకొన్నాడు. వివాహానంతరం అతనికి జీవికకోసం ఏదో ఒక వృత్తి అవలంబించవలసిన అవసరం కలిగింది. అందుచేత అతను అనేకసంస్థలలో చిత్రకళోపాధ్యాయుడుగా పని చేశాడు. తీరికగా ఉన్న సమయాలలో చిత్రాలు చిత్రిస్తూ వాటిని అక్కడక్కడ ప్రదర్శించేవాడు. అతని చిత్రాలు కొన్ని గుజరాతీ పత్రికలలో ప్రకటించారు. అప్పటికే అతనికి మంచి పేరువచ్చింది. అయినా అతను చిత్రకళ ఇంకా బాగా అభ్యసించాలని అనుకొన్నాడు. దీనికోసం కొంతకాలం మథనపడి ఎలాగో అలాగ ఒక ఆరునెలల సెలవు సంపాదించి శాంతినికేతనం వెళ్ళి నందలాల్ బోసువద్ద కొంతకాలం కళాభ్యాసం చేశాడు. ఈ సమయంలో అతను అనేక మూలయిన సూక్ష్మములయిన చిత్రరచనా విశేషాలు అభ్యసించడమేగాక, వివిధ చిత్రాల విన్యాసంలో మంచి నైపుణ్యం గడించుకొన్నాడు. శాంతినికేతనంనించి వచ్చినతరువాత అతని హృదయంలో ఆ మహనీయకృతి చ్ఛాయలెన్నడూ చెరిగిపోలేదు. నాటినించి నేటికీ అతనికి నందలాలుబోసు మీద కలిగినకృతజ్ఞత అలాగే నిలిచిపోయింది.

అహమ్మదాబాదు వచ్చినతరువాత తిరిగి అతనికి పూర్వస్థితిలో ప్రవేశించడం ఎంతో కష్టం అయింది. ఈసమయంలో అతనికి ఎన్నో మానసిక వ్యథలు కలిగాయి. అందుచేత చివరికి అతను ౧౯౩౩ లో సంసారం విడిచి పుదుచ్చేరిలో ఉన్న అరవిందాశ్రమంలో ప్రవేశించాడు. ఇప్పటికీ అతను అక్కడే ఉన్నాడు.

కృష్ణలాలు చిన్ననాటి చిత్రాలు చూస్తే వాటిలో మనకు అతని ఆచార్యులైన రవిశంకర రావాల్, ప్రమోద కుమార చటర్జీల కళాచ్ఛాయలు కనిపిస్తాయి. ఆశ్రమంలో ప్రవేశించినప్పటినించీ అతని పూర్వచ్ఛాయలు అతిక్రమించి నూతనసృష్టి ఉపక్రమించాడు. అయినా అక్కడక్కడ పూర్వాచార్యుల కళాచ్ఛాయలు గోచరిస్తూఉంటాయి. రావాల్ బొంబాయి చిత్రకళాశాలలో ఆరితేరినవాడు. అందుచేత అతను తన అంతేవాసికి ప్రకృతిపరిశీలనము, గూర్జర దేశప్రేమ నేర్పాడు. కృష్ణలాలు చిత్రాలు చాలా వరకు గూర్జరజీవితానికీ ప్రకృతిదృశ్యాలకు సంబంధించినవి.

ఈమధ్యన కొంతకాలంవరకూకూడా మనదేశంలో చిత్రకళాలయాలు సామాన్యులయిన ఆంగ్ల చిత్రకారుల పరిపాలనలో ఉండేవి. అందుచేత ఇంచుమించుగా ౧౦౦ సంవత్సరాలపాటు మనకళ భావనాశూన్యమై, కేవలం విదేశ ప్రభావంలో పడిపోయి మన స్వాతంత్ర్యం మరుగుపడిపోయింది. అందుచేత కళలో చాలావరకు వట్టి నిర్జీవమయిన ప్రకృత్యనుకరణే ప్రవేశించింది. ఈ అనుకరణం కొంతవరకు రావాల్ చిత్రాలలోను ఇంకా కృష్ణలాలు చిన్ననాటి చిత్రాలలోను కనిపిస్తూ వచ్చింది.

కాని ప్రమోదకుమార చటర్జీ సహచర్యం కృష్ణలాలుభట్ భావనాశక్తికి ప్రోద్బలంఇచ్చి స్వేచ్ఛాపూరితమయిన ఆత్మాభివ్యక్తికి ద్వారం కల్పించాడు. తరువాత అతను అరవిందాశ్రమంలో ఉన్నప్పుడే అతని కళకు బాగా పరిణతి కలిగింది. ఆధ్యాత్మికమయిన అతని ప్రతిభ ఆశ్రమంలోనే ఎక్కువగా అభివ్యక్తమయింది. ఆశ్రమంలో అతనికి ఎంతో అనుకూలమయిన వాతావరణం ఏర్పడింది. అభిజ్ఞులు అతన్ని ప్రోత్సహించి మార్గదర్శకులయ్యారు. కృష్ణలాలు ఎంతో స్వేచ్ఛగాను నిర్భయంగాను చిత్రాలు

చిత్రిస్తూ ఒక అచంచలమయిన ఆత్మ నిర్వృతి అందుకోగలిగాడు. కృష్ణలాలుకు ఇంతవరకు తనకు సహజమయిన అభివ్యక్తి వచ్చినదని నమ్మకం కుదరలేదు. అయినా అతను రచించిన వివిధ వైఖరుల చిత్రాలలో ఎంతో భావావేశము, నైపుణి, పరిపూర్ణత, గోచరిస్తాయి.

కృష్ణలాలుకు, తనకు మృగపక్షులకు మధ్యన ఎంతో ఆత్మీయత ఉన్నదని స్ఫురించింది. ఈశిల్పికి చాలా సున్నితమయిన పరిశీలనశక్తి ఉన్నది. ఈశక్తి వల్లనే ఇతడు అనేకమైన సుందర మృగ, పక్షి చిత్రాలు రచించాడు. కేవలం స్మృతిసహాయంతోనే ఇవి రచించిన విషయం ప్రత్యేకంగా గమనించతగినది. అతను అరవిందాశ్రమంలో శ్రీజనని నివాసగృహంలో ౧౫౦ చదరపు టడుగుల మేరలో టెంపరాశైలితో చక్కని కుడ్యచిత్రాలు రచించాడు. నేడు భారతదేశంలో మృగపక్షుల సహజచిత్రాలు చిత్రించేవారు లేనేలేరని చెప్పవచ్చును. శ్రీకృష్ణలాలు ఈవిషయంలో ఒక నూత్నశైలి సృజింపగలడని విశ్వసించవచ్చును.

ఈ చిత్రకారుడు పౌరాణికములు, భావనామయములు మొదలైన అనేక విషయములలో చిత్రరచన సాగించాడు. ఇతని ఆదర్శమయ చిత్రాలలో ఆదర్శ ప్రపంచపు తళతళలు కనులను మిరుమిట్లుగొలుపుతూ ఉంటాయి. ఇలాంటి చిత్రాలలో ఈవైఖరి ప్రత్యేకంగా ప్రశంసింపదగినది. అయితే ఈజాతి చిత్రరచనలలో కొన్నిమాత్రమే బాగావచ్చాయి. వీటిలో ఆకృతులలో అంతర్జీవనం లేకపోవడంచేత, ఇవి చూస్తూంటే మనకు ఏదోచెప్పిందే చెప్పినట్లు కనిపిస్తుంది. ఇతని చిత్రాలలో సాగర ప్రకృతిదృశ్యాలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. ఇవన్నీ కేవలం స్మృతిమాత్రమే ఆధారంగా చేసుకుని రచించినవి. వీటిలో పరిశీలనాశక్తి, సముద్రనృత్యచ్ఛందోరీతి చక్కగా ఉంటాయి. ఈచిత్రాలలో అలంకారాలు ఎంతోమనోహరమయినవి. ఇతడు సాక్షాత్తుగా ప్రకృతిని దర్శించి సృజించిన చిత్రాలుకూడా పేర్కొనదగినవే. వీటిలోకొన్ని చాలా బాగావచ్చాయి. అన్నిటిలోను నవనవజీవ చైతన్యం తాండవిస్తూ ఉన్నట్లు స్ఫురిస్తుంది. ప్రకృతిచిత్రాలలో మనం ఇంతకంటె కోరదగినది మరిఏమి ఉండదు.

కళలో చాలా అపాయకరమైన ప్రభావాలు పనిచేసే రోజులివి. ఈనాడు ఈశిల్పిచిత్రాలు ఎక్కువగా పాతిపద్ధతులమీద రచింపబడినట్లు కనిపించవచ్చును. కాని ఒక స్వతంత్రభావనతోను, అంతగాఢావేశం సహాయంతోను చిత్రరచనచేసే ఈశిల్పి మనలో ఒక మహాశాజ్యోతి వెలిగిస్తున్నట్లు భాసించితీరుతుంది.

అనువాదకుడు : 'శిల్పి'



# పాండురంగకృతి వ్యాఖ్యావిధానము

శ్రీ బులుసు వేంకటరమణయ్య

ప్రాచీనగ్రంథములు సంస్కరణము నపేక్షించి యున్నవనియు, సంస్కరింపబడిన యాగ్రంథములలోఁ గొన్నింటి నవగాహన చేసికొనుటకు వ్యాఖ్యానములే శరణ్యములనియు విమర్శకుల యభిప్రాయమైనట్లు మనమెఱుఁగుదుము. అట్టి యాశయముతోడనే ఈనడుమ ఆంధ్రపంచకావ్యములలో నొకటియగు 'పాండురంగ మాహాత్మ్యము' సంస్కరింపబడినది. ఆవశ్యకములగు భాగములకు విపులముగను, మిగిలినచోట్ల సంకుచితముగను టీక నాచే వ్రాయఁబడినది. అది కొలదికాలములో ముద్రింపబడనున్నది. పెక్కుమంది మిత్రులు నావ్యాఖ్యానపద్ధతిని తెలియఁగోరుటచే మచ్చునకీ క్రిందిభాగమును ఇచ్చుచున్నాను.

అందలి ప్రథమాశ్వాసమున ఆటవికయువతుల వర్ణనసందర్భమున క్రింది పద్యమున్నది-

సీ. కొనలఁజుట్టిన తీఁగపెనచేఁ జమరవాల
    పరికరంబులఁ జుట్టి పట్టి తిగిచి,
కమ్మసంపెఁగల మొగ్గల నిరుగడ రాయు
    జేగురుఁదిరికలు చెంపఁ బెట్టి
పేడికిఁగొడియు శిలీముఖశ్రేణిచే
    మేలిపూగుత్తులు రాలరువ్వి,
కబళనత్వరమాణ కరటితుండములచేఁ
    గదళికాతరువులఁ గాన్పుఁ దాఁచి
తే. నడికురులు, జాదునాసలు, నిబ్బరంపు
    గుబ్బచన్నులుఁ, దొడలపెక్కువలుగలుగు
    మృగవధాజీవతుద్ధాంత మీననయన
    లర్చనలు చేసి కొలిచి రయ్యాలుమగల.
[ప. ౧౨౬]

ఈపద్యము ముద్రితప్రతిలోనున్నట్లే యీయబడినది. దీనికి శ్రీ తెన్మఠం శ్రీరంగాచార్యులుగారి లఘుటీక యీక్రింది విధమునఁగలదు.

'కమ్మ = పరిమళముగల. జేగురుఁదిరికలు = ఎఱ్ఱని జడలు. ఒడియు = ఆకర్షణచేయునట్టి. శిలీముఖ = బాణములయొక్క. కబళన = మ్రింగుటకు. త్వరమాణ = తొందరపడుచున్న. కరటి తుండముల తోడ = ఏనుగుతొండములతోడ. తాఁచి = తన్ని. జాదునాసలు = ఒప్పిదములైన ముక్కులు. నిబ్బరంపు = సడలని. పెక్కువ = ఆధిక్యము. మృగవధాజీవతుద్ధాంత మీననయనలు = బోయలయంతఃపురస్త్రీలు.'

ఈపద్యమునకీ టీక యేమాత్రమును సరిపోదు. ముద్రితపద్యమునఁ [illegible] తప్పులున్నవి. వ్రాఁత ప్రతుల సాయమున సంస్కరించినచోఁ క్రిందివిధముగా [illegible] యుండును.

సీ. 'కొనలఁజుట్టిన తీఁగపెనచేఁ జమరవాల
    పరికరంబుల జుట్టిపట్టి తిగిచి,

చేసెనని చెప్పవచ్చును. మిట్టకోలల యగ్రభాగములు బంతులవలె నుండుటవలన - వానిని ప్రయోగించినపుడు లక్ష్యము గట్టిదెబ్బ తినునుగాని, గ్రుచ్చుకొనిపోదు. కావుననే జింకచర్మము కోరినవారు జింకలను చంపుటకిట్టి బాణములనే ఉపయోగింతురు. మిట్టకోలలు - ప్రయోగించినపిదపఁ గ్రిందఁబడుటయు. పూవుగుత్తులు రాలిపడుటయు స్వభావమేగదా !

కబళన—చేకన్ = కబళించుటలో వేగిరపాటుగల ఏనుఁగుల తొండములవలన; కదళికా తరువులన్ = అరఁటిబోదెలను; కాళ్ళఁదాఁచి = మొదలంటఁబడఁద్రోసి, ఏనుఁగుతొండములును, అరఁటిబోదెలును తొడలకు ఉపమానములు. తొడల సామ్యమును గోరు నాదెంటిలో ఏనుఁగుతొండములంత అరఁటిచెట్ల మొదళ్లను పట్టించి, పీకించెనని భావము. ఇఁటను 'తుండములచేకన్' అనుదానికి సహార్థమును గ్రహించినచో ఏనుగుతొండములతోఁబాటు - వానిని తన్నినట్లు - అరఁటిబోదెలను తన్ని తిరస్కరించెనని భావము.

నెఱికురులు = అందమైన కేశములు; చారునాసలు = చక్కని ముక్కులు; నిబ్బరంపు గుబ్బచన్నులు = సడలని—గట్టివైన గుండ్రని చన్నులు, తొడల పెక్కువయున్ = తొడల అతిశయమును; కలుగు; మృగ ... నయనలు = మృగములను చంపి జీవించు బోయవాండ్ర యాఁడువారు; అర్చనలు చేసి పూజించి అయ్యాలుమగలన్ = భార్యాభర్తలగు నా లోపాముద్రాగస్త్యుల నిరువురను; కొలిచిరి = సేవించిరి.

ఆబోయెతల కురులు తీగలవలెను, చమరవాలపు వెండ్రుకలవలెను ఉన్నవనియు, వారి నాసికలు సంపెంగమొగ్గలవలెను, ఎఱ్ఱని చిగుళ్ళవలెను ఉన్నవనియు, స్తనములు మిట్టకోలల చివఱిభాగములను, పూలగుత్తులను బోలుచున్నవనియు, తొడలు ఏనుఁగు తొండములకును, అరఁటి కంబములకును సరియనియు భావము.

ఆ యువిదలు తమ కేశములందు సవరములు పెట్టుకున్నారనియు, చెంపలకు జేగురుఁ జిగుళ్ళ నలంకరించిరనియు, వక్షములకు మేలి పూగుత్తుల నదిమియుంచుకొన్నారనియు. కదళీకాండములను కాళ్లతోఁదన్నుచు చమత్కారముగా నడచివచ్చుచుండిరనియు ఇచట చమత్కారమును స్ఫురించుచున్నది.

మూఁడవ యాశ్వాసమున నిగమశర్మను వర్ణించు సందర్భమున నీక్రింది పద్యమున్నది.

క. 'అతఁడు కళింగోద్భవుఁడగు
కతమునఁనో వ్రేలఁజూపఁగనుగందకె యో
గ్యతమస్వీకారమునకు
నితరుండెయ్యుంటె ముని సపోత్వర! వింటే.
[ప. ౧౭]

దీనికి క్రింది లఘు టీక శ్రీ తెన్మఠంవారిది కలదు.

కళింగోద్భవుఁడు = కళింగ దేశమునందు బుట్టినవాఁడు. వ్రేలఁజూపఁగన్ = చూచినవారెల్లను వీఁడిట్టివాఁడని వ్రేలితో నితరులకుఁ జూపుచుండఁగా. కనుగందకె = కొంచెమయినను జంకక. యోగ్యతమస్వీకారమునకున్ = మిక్కుటమైన యోగ్యులయొక్క అంగీకారమునకు. ఇతరుఁడు = అన్యుఁడు — సరిపడనివాఁడు—?

శ్రీ తెన్మఠంవారిచట వాచ్యార్థము నే వ్రాసిరి; కాని కవ్యభిప్రేతమగు నర్థాంతరమును జూపలేదు. ఆయర్థము నిట్లు గ్రహింపనగును- 'కళింగము పుచ్చతీగ. కళింగోద్భవము పుచ్చకాయ. వ్రేలితోఁజూపినను పుచ్చకాయ మురిగిపోదు. తక్కిన - తీగలనుండి వ్రేలాడు కాయలను వ్రేలితోఁజూపినయెడల నవి మురిగిపోవును. ఈనమ్మకము కలవారగుటచే వానిం బెంచువారు ఆయెడలకు ఎవ్వరిని రానీయరు. మఱియు పుచ్చకాయ నిషిద్ధవస్తువు కావున శిష్టులెవ్వరును దానిని భుజింపరు.'

పయి యర్థముకూడ కవ్యభిప్రేతమగుటచేతనే - తదనుగుణముగ పదగుంభన మొనర్పబడినది.

# సంపాదకీయ సమీక్షలు

## రాష్ట్రపతి పట్టాభి

డాక్టరు పట్టాభి అధిక సంఖ్యాబలంతో రాష్ట్రపతిగా ఎన్నుకోబడినందుకు వారిని మనసారా అభినందిస్తున్నాము. పట్టాభి ప్రజాస్వాతంత్ర్య యుద్ధంలో ముక్కాకలు తీరిన రాజ్యతంత్రజ్ఞులు. మహాత్ముని సూత్రాలకు మహాభాష్య ప్రణేతగా మహాత్ముని చేతనే ప్రశంసింపబడిన గాంధీ తత్త్వజ్ఞులు. అర్థశతాబ్దంలోగా అనేకమారులు కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గ సభ్యులుగా ఉండి, ఆ సంస్థకు సారథ్యం వహించిన మేధావులు; సంస్థాన వ్యవహారాలు అత్యంత సన్నిహితంగా పరిశీలిస్తూ అఖిలభారత సంస్థాన కాంగ్రెసుకు అధ్యక్షులుగా కూడా ఉండిఉన్న సుప్రసిద్ధులు.

అయితే రాజేంద్రప్రసాదువంటి పెద్దలు కాంగ్రెసు అధ్యక్షుని ఎన్నిక పోటీలేకుండా జరగడం సముచితమని అని ఉండడంవల్ల ఏకగ్రీవంగా ఎన్నిక జరగగలదేమోనని అనుకున్నాము. కాని అలాగ జరగలేదు. శ్రీ టాండను కాంగ్రెసు పెద్దల సలహాలు కూడా పెడచెవిని పెట్టి చివరదాకా పోటీలో నిలబడి పరాజితులయినారు. కాని ఈపోటీలో వచ్చిన విజయంవల్ల పట్టాభి ప్రఖ్యాతీ, పట్టాభిని అధ్యక్షస్థానానికని నిర్దేశించిన కాంగ్రెసు పెద్దల దూరదర్శిత, పదిరెట్లుగా ఇనుమడించినాయని భావిస్తున్నాము.

పట్టాభివంటి ప్రఖ్యాతనాయకుడు ఈసమయంలో అధ్యక్షుడుగా ఎన్నుకోబడకపోతే ఆశ్చర్యకరమైన విషయంగాని, ఎన్నుకోబడితే అంతగా ఆశ్చర్యమేమి లేదని అనిపించవచ్చును.

కాని విభజనానంతరం దేశంలో కులతత్త్వము హింసాతత్త్వము, బాగా ఇనుమడించాయి. ఈ మతతత్త్వ పిశాచానికే మహాత్ముని ప్రాణాలు ఆహుతి అయ్యాయని మనమంతా ఎరుగుదుము. శ్రీ పురుషోత్తమదాసు టాండను తాను హిందూతత్త్వానికి ప్రతినిధినని ప్రకటించకపోయినా ఆయన అలాంటి సానుభూతి కలవాడని అందరికీ విదితమే. ఈ క్లిష్ట సమయంలో టాండను పరాజయంవల్ల పట్టాభివ్యక్తికే గాక కాంగ్రెసులో ప్రజాస్వామ్య దృక్పథానికి కూడా అఖండవిజయం చేకూరిందని భావిస్తున్నాము.

పట్టాభి ఎన్నిక సందర్భంలో ఆంధ్రులు తలవంచుకోవలసిన విషయం మాత్రం ఒకటి ఉంది. ఆంధ్రుల అగ్రనాయకులంతా పట్టాభిని సర్వులూ ఎన్నుకోవలిసిందని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రులందరూ ఒక్క ఓటైనా పొల్లుపోకుండా వారిని ఎన్నుకోగలరని ఆశించాము. కాని కొందరు వారికి వ్యతిరేకంగా ఓటుచేశారు. అయితే పక్కనేఉన్న తమిళనాడులో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకుని గౌరవించారు! ఇలాంటప్పుడు మనం ఈవిషయంలో తమిళ సోదరుల ఎదట తలఎత్తుకొని తిరగగలమా? ఇకనైనా తమిళ సోదరులదగ్గరనించి మనం క్రమశిక్షణ అలవరుచుకో గలిగితే మనకు తరుణోపాయమున్నది.

పట్టాభి సర్వసమర్థులు. వారు తమస్థాన గౌరవం సహస్రధా ఇనుమడింప జేయగలరని మా నమ్మకం. అంతేగాదు. పట్టాభి ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర సిద్ధిలో కలిగిన అడ్డంకులన్నీ తొలగగలవనీ, వారి

అచిరకాలంలోనే భాషారాష్ట్రాల విషయమై భారత నాయకులలో కలిగిన వైముఖ్యం తొలగించగలరనీ త్వరలోనే అఖండాంధ్ర రాష్ట్రం సిద్ధించగలదనీ కూడా ఆశిస్తున్నాము.

## ఆస్థానకవి

మద్రాసు ప్రభుత్వపు ఆస్థానకవి ఏర్పాటు చదివిన తరవాత దసరానాటికే ఆస్థానకవి ఏర్పాటు జరుగుతుందనీ దసరాలలో ఈవిషయమైన ఉత్సవాలు జేగీయమానంగా జరగగలవనీ ఆశించాము. కాని ఏకారణంచేతనోగాని ఇంకా అలాంటి అలికిడేమీ ఉన్నట్లు కనబడదు. ఇలాగ ఆలస్యం జరగడానికి కారణమేమిటో మాకు తెలియదు. ప్రభుత్వంలో పలుకుబడిఉన్న అనేకులు అనేక విధాలుగా ఈఎన్నికలో తమతమ బలాబలాలు ఉపయోగిస్తున్నారేమోవని అనుమానంగాఉంది. సరియైన అభిరుచీ, వివేచనమూ,ఉంటే దీనివిషయంలో ఇంత ఆలస్యానికి అవకాశమేలేదని భావిస్తున్నాము.

పద్యాలువ్రాసే ప్రతీఆసామీ 'కవి'గా గుర్తింపబడే ఈరోజుల్లో సరియైన కవులకు గౌరవాదరాలూ సన్నగిల్లి, కవితాభాసానికి ఊరేగింపులు జరుగుతున్నాయని ప్రభుత్వం గుర్తించడం చాలా అవసరము. ప్రభుత్వపు ఎన్నికలోగూడా కొంత పరిమితమైన కవిత్వదృష్టి తప్పనిదే అని మేము భావిస్తున్నాము. ప్రభుత్వము 'జాతీయకవి'ని ఆస్థానకవిగా గుర్తించుకుంటూ ఉందిగాని కేవలం 'కవి'ని మాత్రమేగుర్తించుకోవడంలేదు. కనక దేశం అంతటిలోను జాతీయ కవితా నాయకులుగా ఉన్నవారెవరో గమనించడం అవసరం అవుతుంది. ఇలా కవితా నాయకులుగా ఉన్నవారు సుప్రసిద్ధులు అయిదారుగురు ఉన్నారు. ఈ అయిదారుగురులోను ఇద్దరు బాగా వెనకతరానికి చెందినవారు. మిగిలిన నలుగురూ ఆధునిక యుగానికి చెందినవారు.

బాగా వెనకతరానికి చెందినవారిలో శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారి సుగృహీత నామధేయం తటాలున అందరికీ స్ఫురించితీరుతుంది. ఈ మహామహుడు కవితను తాళపత్ర బంధనాల చెర విడిపించి, రాజాస్థానంలోను ప్రజాహృదయాల్లోను ఆనందంపల్లకిలో ఊరేగించినవాడు. ఆధునిక యుగంలో సుప్రసిద్ధులయిన శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు, శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారు, శ్రీ మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రిగారు మొదలయినవారు వారి శిష్యులమని అనుకొనడమే ఒక గర్వకారణంగా భావించే మహత్వంవారికి అబ్బింది. శ్రీ చెళ్లపిళ్ల కవి, గొప్పకవిగా, నాటకకర్తగా గద్యరచయితగా ఇంకా అనేక విధాలుగా అనితర సాధారణమైన ఔన్నత్యం గడించుకొన్నవాడు. నేటి కాలంలో కవులందరూ చాలావరకు, సాక్షాత్తుగాగాని పరంపరంగాగాని — వారి కవితావంశానికి చెందినవారే!

అయితే మనదేశం ఒక యాభైయేళ్ళకు పూర్వం స్వతంత్రమై ఉండి, జాతీయకవిని ఎన్నుకోవలసిఉంటే అప్పుడే వారినామధేయం అద్వితీయంగా ఎన్నికకు రాగలిగేది. కనకనే మనకు అథమపక్షం రెండు తరాలలోని సుప్రసిద్ధ కవులలోనుంచి ఆస్థానకవిని ఎన్నుకునే అవసరము. వారి విషయమైన తారతమ్య పరీక్షలూ వస్తున్నాయని అనుకుంటున్నాము.

అయితే చెళ్లపిళ్ల కవిలో ఒక నిత్యనూతనమైన సజీవకవితా చైతన్యం ఉంది. ఆయన ఎంత విప్లవకరమైన నవ్య కవితలోనైనా కవితాత్మ గ్రహించి ప్రోత్సహించగలరని వినికిడి. కనకనే భిన్నభిన్న

కవితా ప్రస్థానాలు అవలంభించిన అనేక సుప్రసిద్ధ కవులు వారిని కవితాచార్యులుగా భావించడం జరిగింది. ఎంతవృద్ధులైనా నేటికీ వారు వాఙ్మయవ్యాసంగంలోనే కాలంగడుపుతున్నారు. ఈకవి పూర్వం ఒకప్పుడు "కవితార్థం బుదయించితిన్, సుకవితా కార్యంబునావృత్తి" అన్న సూక్తిన్యాసోక్తి మాత్రమే.

ఈకవిని ఆస్థానకవినిగా ఎన్నుకొన్నప్పుడు ప్రభుత్వానికి వరసగా మూడుతరాల కవితా ప్రస్థానాల ఉత్తమకవిని గౌరవించినంత గణ్యత ఏర్పడుతుంది. ఈలాంటి అద్వితీయమైన మహాత్వం సజీవులైన నేటి కవులలో ఒక్క చెళ్లపిళ్లకవికే దక్కింది.

ప్రభుత్వంలో ఈవిషయం గమనించే నివేచన, అభిరుచి, ఉన్నవనీ, ఈమహాకవిని గౌరవించడం వల్ల ప్రభుత్వం తనగౌరవం దక్కించుకోగలదనీ, భావిస్తున్నాము. ఈవిధమైన గుర్తింపు జరిగినతరువాత త్వరలోనే తద్విషయకమైన మహోత్సవం గూడా జరగగలదని నిరీక్షిస్తున్నాము.

## లింగరాజుగారి నల్లబజారు

"రాజమండ్రి జైలు నరకకూపమా?" అనే శ్రీ 'నవయుగ, వారి జైలు పరిపాలనా విధానంపై నిరసన చదివాము. దానిలో జైలర్లు ప్రిజనర్లను పెట్టుచున్న బాధలకంటె. మమ్మల్ని బాధించిన అంశం మాజీ సామ్యవాది క్రొవ్విడి లింగరాజుగార్ని గురించి నగయుగ వ్రాక్కుచ్చిన విషయం! ౨౦ అవున్సుల ఆహారంలో ౧౨ మాత్రమే ఖైదీలకంది తతిమ్మాది నల్లబజారులోకి పోతూందనీ, ఆనల్లబజారు వ్యాపారంలో లింగరాజుగారికి వాటా ఉందనీ 'నవయుగ' వారు రూఢిగా తెలుస్తూందంటున్నారు, సీతానగరం ఆశ్రమంనాటినించీ కాంగ్రెసులో సేవచేస్తూ, రాజమహేంద్రవరం మునిసిపల్ చైరుమెనుగిరీకూడా చలాయించినా, కాంగ్రెసువాది లింగరాజుగారు ఇల్లాంటి దారుణపు పనికి పూనారని మేము నమ్మలేకుండా వున్నాము. అదే నిజమయితే "కంచెరయే చేనుమేసిన" అన్నగతి కొచ్చావున్నమాట!! ఈవిషయంలో శ్రీ లింగరాజుగారేమనేదీ పత్రికాముఖంగా వెలువడ్డం న్యాయం; త్వరలోవారు తమ నిర్మలత్వం ఋజువుపరుచుకోగలరని అనుకోవచ్చునా?





# గ్రంథ విమర్శనము

సంపెంగతోట — ఆంటన్ చెహూవ్ — శ్రీరంగం శ్రీనివాసరావు — అబ్బూరి వరద రాజేశ్వరరావు — ప్రజాసాహిత్య పరిషత్తు తెనాలి- వెల రూ. ౧

ఇది సుప్రసిద్ధ రష్యన్ రచయిత-ఆంటన్ చెహోవ్ చే వ్రాయబడిన ప్రఖ్యాతనాటకము, 'చెరి అర్చర్డు'కు శ్రీ.శ్రీ. అ.వ. రాజేశ్వరరావుగార్ల అనువాదం. అసలీఅనువాదకులు అనువదించడానికి ఎంతవరకు హక్కుదార్లన్నది ఒకవాదం. దానికీ విమర్శకూ సంబంధంలేదని నా వాదం.

అనువాదకుల కథనప్రకారం. ౧ కథాస్థానము — అనకాపల్లి ప్రాంతం? ౨ కథాకాలం ౧౯౫౨ ప్రాంతం (విశాఖపట్నంమీద బాంబులుపడ్డ కొద్దినెలల అనంతరం) శీతాకాలము.

ఇంక ప్రథమ కబలేమక్షికాపాతః—

ఆంధ్రదేశం మొత్తంమీద జరగనివింత-వీరి కథాప్రారంభం ఉదయం ౫ గంటలకు సూర్యోదయంతో. ఈకథకులు డిసంబరు నెలలో ఏగ్రామంలో ఉదయం ౫ గంటలకు సూర్యోదయం చూశారో భగవంతునికే తెలియాలి!

"అమ్మయ్య! రైలు వచ్చేసింది" వాక్యంలో సంతృప్తి, ఇదిరైలుదగ్గిర కలుసుకొందామనివచ్చి, ఇంటివద్ద నిద్రపోయి, నువ్వైనా లేపలేకపోయావా? అనే ఆసామీ మాట. విచారంలేదు. తను వారిని కలుసుకోలేక పోయినందుకు! సంతృప్తితప్ప! ఈయన ఒక రైతుబిడ్డ. ప్రస్తుతం వ్యాపారి, లేచివచ్చి కాలకృత్యాదులమాట అటుంచి ఆంధ్రదేశంలో ఉదయం ౫ గంటల చిల్లర్ని శీతాకాలంలో దాహానికి అడిగేది మజ్జిగ!! ఒకమూల అటు సంపెంగతోటలో మంచు కురుస్తోంది, రంగవర్ణన ప్రకారం. ఇటు శివయ్యమాత్రం 'ఇవాళ ఉక్క జాస్తీగా ఉంది. పువ్వులు విరియబూసినా, యీవేడికి వసివాడుతయేమో'' అంటాడు! పైగా, తోటలో కోయిల హాయిగా కూస్తోంది, శీతాకాలంలో!

ఈకవులను ఏమిఅనాలి? కాలాతీతులనాలా? ఇట్టి రచనవిని మ్రింగి ఆనందించవలసినదేనా పాఠకలోకం!

కాగా యింకొక చిత్రం. ఒక్కమారు మిమ్మల్నిచూసి మాట్లాడిపోవాలని వచ్చానని చెబుతూ జయశ్రీతో "అప్పటికీ ఇప్పు

టికి "మీరు లక్ష్మీదేవిలాఉన్నారు" అంటాడు! ఆ పూర్వ సువాసినిని గురించి! వెంటనే లింగమూర్తి అనే భూస్వామి. "రోజు రోజుకు చేవదేర్తోంది ఆవిడఅందం. కాని, ఆకంచిచీర చూడండి ఎంత మజాగా కట్టారో, కళ్లు జిగేలుమంటున్నాయి!" అంటాడు. నిజమే! కళ్లు జిగేల్‌మనవలసినదే ఇట్టి అసందర్భ ప్రలాపాలు సమక్షంలో ఒక స్త్రీనిగురించి పలికినందుకు! పరస్పర పరిస్థితులనో అనువదింపబోయి అనుకరింప జేసి కాల్చిన తెల్ల మతాబాయిది!

పైగా Dressing room కు తెలుగులా ఉంది! "నగలగది" అని ఒక గదిని సృష్టించారు తెలుగు నాటు! సామానుగది అనబడే కొత్తగది ఒకటి లంబరు రూముకు వ్యాఖ్యానంకాబోలు!

పురుళ్లగది అని ఒకగది అన్నాడు. ఎన్ని పురుళ్లుపోసుకున్నా అది పురిటిగదే కాని పురుళ్లగది అని ఎప్పుడూ పిలవబడదు.

"పూట వంటకింటలు ఆలస్యం అయింది. ఇలా చేసుకోవాలరా ఎవరైనా ?" ఇది విరించి పలుకు. పూటలు ఆలస్యం అవడాని ఇలాచేసుకోవడానికి సంబంధం ఏమిటో?

జానకి అంటుంది "నీవులేకపోవడం ఇల్లు ఇల్లుగాలేదు. ఇంటిమాట చెప్పకుగాని, నాఘోష వినేందుకు ఎవరూ లేకపోయా" రని. ఇంటిమాట చెప్పకుగాని అనే ప్రయోగం వింతగాఉంది. ఏమంటే ఇట్టి పరిస్థితులలో ఇంటిమాటకేంగాని, నా ఘోష వినేందుకయినా ఎవరూ లేకపోయా'రని దేశీయంగా వాడుకలో ఉంటోందిగాని, ఇంటిమాట చెప్పకుగాని అని అనడం ఏ ఆంధ్ర వనిత నోటివెంబడినీ వినలేదని నా ఊహ.

కాగా, వీరి ఇతర ప్రయోగాలుకూడా హాస్యాస్పదంగా ఉన్నాయి.

"నువ్వొట్టి పిచ్చిదానివి, తమ్ముడన్నా తమ్ముడుకాదు. చక్కనిచుక్క నీటిలోపడి బలవంతపుబాధ చచ్చిపోయాడు – కళ్లంబడి నీళ్లు జడివానలా కురిశాయి – దీనికి ప్రాణం లేదనే కట్టుకోండి– నేపడుకొంటే సుఖంవచ్చి జోకొట్టదది. ప్రొద్దున్నే సుఖమే నిద్రలేపేది. అప్పు అప్పటలాగే ఉంది తోట– ఏంచేస్తాం! ఆ పనుకొండలవాడి ఇచ్చు" చావునిగురించి నడిచేప్రస్తావనలో యిట్టివాక్యం ఎక్కడైనా విన్నారా!

పైవిభక్తి శేషిశాయి. వ్యాపారంచేస్తున్నా, అట్టి అక్షరజ్ఞానంలేనివాడు, తన్ని గురించి చెప్పుకుంటాడు. "నాకు అక్షరం ముక్కకూడా చెప్పించలేదు. ఒక్కపాఠం సరిగాచదవలేదు. ఇహ దస్తూరీ బ్రహ్మరాత! చదువుకున్న వాళ్లదగ్గర నా మొహం చూపెట్టటానికి చిన్నతనంగా ఉంటుంది'అని. అట్టివానినోటమ్మాటఅసందర్భంగా "త్యాగరాజుపాట, దాక్షిణాత్యులనోట భాషకాని వెర్రిఘోషకాదే!" అనిపిస్తా

కవులు! కవులబుర్రలో కాకపోతే దాక్షిణా త్యుల సందర్భంకథలోకి ఏలా వచ్చిందో; అక్షరంముక్క లేని వ్యాపారస్థుని నోట మ్మాట ఇట్టిపలుకులు పలికించవలసిన అవస రంప మిటో అవగాహన కావడంలేదు.

కైతుల్ని పశువుల్లా చూస్తారు. క్రొత్త దేదీనేర్చుకోరు. పాతదేవీ మననంచేయరు. 'పాతది' అనేపదం బహువచనం పాతదేవీ కాబోలు!

పైగా 'ముచ్చటలు 'పట్టేస్తుంది'-కర్మం యీావాలతో 'తేలిపోతుంది' - సంగతేవీ బోధపడదు-చాదస్తాలు పెట్టకోక, నిజాన్ని ఉన్నదున్నట్లు గుర్తించమనిసలహా ఇస్తారు- నువ్వొట్టి వెటకారంమనిషివి- 'వాజవి'-అం టారు. వాజమ్మవి అనగాని వాజవి అనే ప్రయోగం వాడుకలోలేదు.

అన్నిటికంటె ముఖ్యం యీకవులకు ఏక వచనానికీ, బహువచనానికీ ఉత్తమపురుషకీ మధ్యమ పురుషకీ భేదాలుఉన్నట్లు తెలియ దల్లేఉంది. ఆఖరికి స్త్రీ, పుంలింగాలు కూడా అడ్డంరావు వీరి ధోరణికి! చూడండి! "చేతిలో పదకొండుదూ పాయిలుమాత్రము ఉన్నాయి. 'అరే! కనిపించడంలేదే,' ఎక్కడో 'పోయింది.' ఎక్కడ పారేసుకొ న్నానో! అమ్మయ్య! ఈజేబులో'ఉంది.'

తోటనుగురించి జయశ్రీ 'అచ్చ అప్ప ట్లాగే.'ఉంది'తోట;పిసరు మార్పులేదు. అం టాలకుప్ప, మలమలమాడ్చే వేసవి,గజగజ లాడించే శీతాకాలందాటి హాయిగా ఆనం దంగా 'ఉన్నావు.'

బీరువానుగురించి,విరించి 'నీవుయెన్నన్ని ఉన్నతాశయోపేతములయిన పవిత్రభావా లను వెదజల్లి మాలో విజ్ఞానాన్ని ధర్మాన్ని విస్తరిల్ల 'జేశావో.' ఈ అరవైయేళ్లలో నీ మౌనసందేశం యెంతమందికి ఋజుమార్గం చూపించేజ్ఞాన తర్జనిగా 'పనిచేసిందో!'మాన వజగత్తుకి మహిమాన్విత భవిష్యత్తు ను ప్రసాదించగల వినూతన విజ్ఞానాన్నిచ్చి తర తరాలవారికి సముజ్జ్వల సాంఘిక చైతన్యా న్నిచ్చి రగుల్కొల్ప 'జేసిందో.'

"మీా అమ్మగారు నన్నెప్పుడూ తూల నాడడంవే ఒక పనికింద పెట్టుకున్నట్టుంది. నాకు డబ్బుదాహం జాస్తీ అని కులం తక్కు వని ఏవేవో అంటారు. నేను లెక్కచేసే వాణ్ణి కాదనుకోండి. అయనమాటలువిని మీారు నన్ను చులకనగా చూడకుండా ఉంటే చాలులెండి!"

ఈ కవులు కాలాతీతులని అన్నాను. ప్రథమాంకం ఉదయం ౫ గంటలకు సూర్యో దయంతో ఆరంభమయి ౨౬ పేజీలో "నన్ను ఉదయంవరకు కనిపెట్టకొని ఉండ మన్నారు. ఉన్నాను." అనే అనంతంవాక్కు వరకూకూడా ఉదయంగానేఉంచి ౨౭ పేజీలో యిహ నిద్రలకిలేవచ్చు. ప్రాణం చాలో స్తోంది. నేమనవిచేసింది రేపటికైనా యిప్పిస్తే అదును గడిపినవారవుతారు అని"

# గ్రంథ విమర్శనము

చదవడం ఆరంభించాను. ఆరంభించి, పూర్తిచేసి, ఒక్క దీర్ఘనిశ్వాసం విడుస్తూ 'అమ్మయ్య' అని అనుకున్నాను, హృదయం మీదుంచి ఏదో బరువు తీసేసినట్టుగా? ఎందుకంటే, రచన సాఫీగాపోక నన్ను నిలిపి, నా ఆనందాన్ని నలిపేసింది.

మొట్టమొదట, ఈ గ్రంథ నామకరణం తోటే వస్తోంది తగాదా. ఒక కావ్యంకానీ యండి, కళ కానీయండి, లేకపోతే మరే దైనా కానీండి—వివిధకోణాల్లోంచిచూసి, నిశితంగా సరిగ్గా అవలోకన చేసి—బాగోగుల్ని దృఢంగా నిర్ణయించుకొని, ఎక్కడ ఔచిత్యం ఉందో ఎక్కడ అనౌచిత్యం ఉందో, ఎక్కడ రసపుష్టి ఉందో. ఎక్కడ సౌందర్యం ఉందో ఎత్తిచూపగలిగితే 'విమర్శ' అవుతుంది. అట్లా అన్నింటిని విమర్శించ కలిగితే అని అనుకొంటాను, గ్రంథాను లేపనమనీ అనుకొంటాను.

ఎంత ఆలోచించినా, ఎన్నివిధాలుగా చూసినా ఈ గ్రంథనామం 'చిత్రకళా విమర్శ' అని అనడానికి తగిందని నాకు తోచడంలేదు. ఎందుచేతంటే రచయిత ౧ కళాలక్షణము – ఆశయము ౨ భారతీయ కళాతత్త్వము ౩ కళాన్వేషణము – ప్రాక్పశ్చిమ దృక్పథములు ౪ కళాంతరార్థము – ఆధ్యాత్మికము ౫ కళాచిత్రములోని పరమార్థము ౬ శివపార్వతీ చిత్రము – అన్న అంశాలను గురించి వ్రాశాడేకాని దేనినీ విమర్శనా దృష్టితో పరికించనన్నాలేదు. అటువంటప్పుడు ఇది విమర్శనా గ్రంథం ఎల్లాగౌతుందీ అని నావాదన.

దీంట్లో ఉన్నవి ఆరుచిత్రాలు. గ్రంథాదిని ఉన్న గ్రంథకర్త చిత్రం తప్పిస్తే మిగిలిన అయిదింటినీ రచయితే చిత్రించారు. ౧ శకుంతల పత్రలేఖనం ౨ ప్రవరాఖ్య వరూధినీ సమాగమము ౩ అమరగాంధి ౪ శివపార్వతి ౫ నటరాజ నృత్యము:– వీటిని చిత్రకళా ఖండాలు అని నేను అనలేను 'చాలా బాగున్నాయి' అని కూడా అనలేను. సామాన్యంగా ఉన్నాయి అని మాత్రంతో సరిపెడతాను. కాని రెడ్డిగారు అంటారూ "I have seen some of the painted pictures of Mr. D. Sarveswara Rao and was struck by their artistic excellence" అని. రెడ్డిగారికున్నంత కళాగ్రహణశక్తీ, రసానుభూతీ నాకు లేవేమో?

ఈ గ్రంథానికీ, చిత్రాలకీ ఉన్నసంబంధం ఏమిటీ అని ఆలోచించడం అనౌచితి కాదనుకుంటాను. 'శివ పార్వతి-నటరాజ నృత్యం' ఈ రెండింటికీ – గ్రంథానికీ ఏదో సంబంధాన్ని కలపగలిగాడు రచయిత. మిగిలినవి గాలిలో వేళ్ళాడుతున్నాయ్. ప్రాక్పశ్చిమ కళలకీ, (భారతీయ) పౌరాణిక ఆధునిక కళా సంప్రదాయాలకీ, చిత్రకారుడు కళాప్రపంచంలో తీసుకువచ్చిన వినూత్న దేనినో శైలికీ, ఉదాహరణంగా – చిత్రాల్ని ప్రక

టిస్తే సంతోషిస్తాం. గ్రంథానికి అనవసరమైన చిత్రాల్ని, తను చిత్రించిన చిత్రాల్ని, తన గ్రంథంలోనే ప్రకటించుకోవడంచూస్తే ఈ రచయితకి స్వోత్కర్ష చెప్పుకుందామన్న తహతహ ఎక్కువగా కనిపిస్తుంది—ఆశ్చర్యపడవలసినదేమంటే, 'అమర గాంధి' చిత్రంచూస్తే. గ్రంథాదినిఉన్న రచయిత రూపం దాంట్లో కలిపించడం!!!!

కొంచెం ఓపికతో గ్రంథాన్ని చదివితే—కళమీదా, కళా ప్రయోజనంమీదా, కళాకారుడి అనుష్ఠాన ధర్మాలమీదా, ప్రాచీన గ్రంథాల నాధారంతో రచయిత చెప్పిన విషయాలు చదువతగ్గవి. భారతీయ చిత్రాల్లో ఉండే సంజ్ఞలు, (హస్తముద్రలు మొదలైనవి) వాహనాదికాలూ మనకి ఈ గ్రంథ పఠనంవల్ల తేటతెల్లం అవుతాయి. ఉపనిషత్తులు, శుక్రనీతిసారం వేదాలు మొదలైన అతి ప్రాచీన గ్రంథాల్లో, కళా విషయమైన శ్లోకాల్ని సేకరించి ఉదాహరించడం ఈ గ్రంథానికి ప్రత్యేకం. అందుకు గ్రంథకర్తని అభినందించక తప్పదు.

'మహతి'



# ఆంధ్రశిల్పి

ప్రతినెలా ౧౦వ తేదీని

ప్రకటింప బడుతుంది

సంపాదకులు:

శ్రీ గణపతి శాస్త్రి.
శ్రీ సాంబశివరావు.

## విభ్రాంతా మరకము.

వెల. రూపాయి.

## రత్నోపహారము.

వెల: రూపాయి.

శ్రీ గణపతి శాస్త్రి.

౧౦ నరసింగపురంవీధి, మౌంటురోడ్,

మదరాసు–౨.

లేక,

సర్వ సాహిత్య పరిషత్తు: గుంటూరు.

---

★

# UNIVERSAL UNCOOKED FOOD

★

By

B. S. Gopala Rao.

10, Narasingapuram St., Mount Rd.,

MADRAS-2.

# డాక్యుమెంటరీ, విద్యావిషయిక చలన చిత్రాలు!

## ప్రదర్శనానికి సిద్ధంగా ఉన్నాయి!

౧. పురాణకాలంనుంచీ అమల్లోఉన్న నేటి మన పింగాణీ పరిశ్రమ.

ప్రపంచకంలోకల్లా ఈ విషయంలో తయారయి ఉన్న ఫిల్ము.

౨. జపాను దేశపు చేతి కాగితముల పరిశ్రమ

౩. జపాను దేశపు బొమ్మల పరిశ్రమ

౪. శ్రీ శరత్ బాబుచే తెరువబడి, ఆశీర్వదించబడిన

అఖిలభారత పారిశ్రామిక కళా ప్రదర్శనం

ఇందలి వివిధ వస్తు ప్రదర్శనశాలలు, చిత్రకళా ప్రదర్శనము, నాటకములు, భరత నాట్యములు, పాటకచ్చేరీలు వగైరా చూడనగును.

వివరములకు:—

## "శిల్పి ప్రచురణాలు"

ఫిల్ము శాఖ,

౧౦, నరసింగపురం వీధి, మౌంట్ రోడ్, మద్రాసు.

ఇది నెం. ౪౮. ఆయులూరు ముత్తయ్య ముదలి వీధి, శ్రమజీవి ప్రెస్సు లిమిటెడ్‌లో శ్రీమాన్ చిలకమర్తి లక్ష్మీనారాయణాచార్య గారిచే ముద్రింపబడి, ౧౦, నరసింగపురం వీధిలోని ఆంధ్రశిల్పి కార్యాలయంలో